ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 11 సంచిక : 3 నవంబరు 2005

## దేవుడు

దేవుడు అనగా మనచే చూడబడే ఈ సమస్త సృష్టికి ఆధారంగా వుండి, ఆ సృష్టిని అతిక్రమించినవాడు అని అర్థం. అనగా దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన కేవల ఉనికి. దేవుడు అనగా అంతటా, అన్ని కాలాలలోనూ ప్రకాశించే దివ్యమైన, సమగ్రమైన, సద్వస్తువు. ఆత్మ, నేను, దేవుడు, సత్యము, బ్రహ్మము, చైతన్యము ఇవన్నీ కేవలము ఉన్న ఏకైక సత్యమునకు పర్యాయపదములే! దేవుడు అనగా పరమశాంతి, పరమ కరుణ, మరణంలేని స్థితి. అన్నిటికి దేవుడే ఆధారము. సృష్టిలో అన్ని నామాలు, రూపాలు ఆ భగవంతునివే! కాని భగవంతుడు అన్నిటికి అతీతము. ఒక్క భగవంతుడు తప్ప సృష్టిలో ప్రతీది కాలప్రవాహంలో కొట్టుకుపోవలసిందే. భగవంతుని ఉనికి వల్లనే వాస్తవంగా లేని ప్రపంచము ఉన్నదాని వలె కనబడుతున్నది. ఒక్క దేవుడు తప్ప సృష్టిలో ఏ ఒక్క వస్తువు శాశ్వతంగా నిలవదు. 'నేను' అనే భావనను భగవంతునికి కాక దేహేంద్రియమనోబుద్ధులకు ఆపాదించుటయే మనము చేయు పొరపాటు. దేహము పట్ల, ప్రపంచము మీద మనకున్న విశ్వాసము భగవంతుని మీద లేకపోవుటయే సర్వ అనర్థములకు, దుఃఖమునకు కారణము. సూర్యుడు ఉదయించాడు అంటాడు, సూర్యుడు పుట్టాడు అనము అట్లే భగవంతుడు సర్వకాల సర్వావస్థలలోనూ ఉండే ఏకైక పారమార్థిక సత్యము. తనను తెలియుటయే దేవుని తెలియుట.

– చావలి సూర్యనారాయణమూర్తి

టీచర్, అమలాపురం

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥100/-

విడి ప్రతి : రు॥ 5/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

వడ్లూరు ....................... 30-08-05

జిన్నూరు ...................... 23-09-05

చిలుకూరు .................... 08-10-05

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, ☎ 08814 - 228858

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం చరిత్ర జాగ్రత్తగా చూస్తే హిందూమతంకాని, మహమ్మదీయమతంగాని, జైనమతంగాని ఏ మతస్థులైనా మన మహర్షులు, మహాత్ములు అందరూ కూడా మానవుడిని అసలు దుఃఖం ఎలాఉంటుందో తెలియనిస్థితికి తీసుకొనివెళ్ళటానికి ప్రయత్నం చేసారు, కొంతవరకు సక్సెస్ అయ్యారు. పూర్వం కంటే ఇప్పడు టెక్నాలజీ పెరిగింది, మెడిసిన్ అభివృద్ధి అయ్యింది. సైన్స్ మనకు కొంతవరకు కంఫర్టు తీసుకొని వచ్చింది కాని మానవుడిని దుఃఖంలేని స్థితికి సైన్స్ తీసుకొని వెళ్ళలేక పోయింది. మీరు ఎప్పడూ రీజన్‌ను విడిచిపెట్టవద్దు. నేను ఏదైనా ఒకమాట చెపుతూఉంటే అది ఎంతవరకు రీజన్‌కు అందుతోందో చూసుకోండి, మూఢనమ్మకాలు పెట్టుకోవద్దు. మాకు చేతనైతే మీ చైతన్యస్థాయిని పెంచాలి, మీ వివేకాన్ని పెంచాలి కాని మీకు ఉన్న తెలివితేటలను చంపేయకూడదు. ఇతరులు ఎవరైనా మోసం చేయటానికి ప్రయత్నం చేస్తూఉంటే అందులో పడకుండా ఉండటం కోసం మనకు రీజను అవసరం, తెలివి అవసరం, కూల్‌థింకింగ్ అవసరం. మన శరీరం ఏదో రోజున చనిపోతుంది. "ది బాడీ మస్ట్ గో బికాజ్ ఇట్ ఈజ్ నాట్ ఐ" ఈ శరీరం మనల్ని విడిచిపెట్టేసి వెళ్ళిపోతుంది ఎందుచేత నంటే అది మనం కాదు. నేను కానిదానితో ఏదోరోజున విడిపోవలసిందే. మనం పూర్ణసుఖం, ఆభవసుఖం, చిత్‌సుఖం పొందలేకపోవటానికి కారణం ఏమిటి అంటే ఈశరీరం భూమి మీదకు వచ్చినది మొదలు శరీరం చనిపోయేవరకు మనం కానిదానితో తాదాత్మ్యం పొందుతున్నాము, మనం ఏదైతేఅవునో దానిని తెలుసుకొనే ప్రయత్నం చేయటంలేదు, దానికి సంబంధించిన శ్రవణం లేదు, అభ్యాసం లేదు, కృషి లేదు. ఏమీలేకుండా ఏవో మేజిక్‌లవల్ల, జిమ్మిక్కుల వల్ల దుఃఖంలేనిస్థితిని పొందలేవు. ఎంతకాలం అయితే తన దేహానికి, తన మనస్సుకీ, తన తెలివికి పరిమితమై ఉన్నాడో అంతకాలం ఈ శరీరంలో ఉన్నప్పడే కాదు, రాబోయే శరీరంలో కూడా దుఃఖంలేనిస్థితికి వెళ్ళే అవకాశం లేదు. ఇక్కడ మనం ఇంతమంది ఉన్నాము, భగవంతుడిని ప్రేమిస్తున్నాము అని అనుకొంటున్నా ము. లోకానికి సంబంధించిన వాంఛలతో సంబంధం లేకుండా హృదయపూర్వకంగా భగవంతుడిని ప్రేమించేవారు మనలో ఎంతమంది ఉన్నారు. గుడికి వెళుతున్నారు, అభిషేకాలు చేస్తున్నారు, ఏదేదో చేస్తున్నారు, మీ పద్ధతిలో మీరు చేస్తున్నారు. భగవంతుడిపట్ల మీకు

ఉన్న ప్రేమలో లోకానికి సంబంధించిన విషయాలు, భౌతిక విషయాలు ఏమీ అంటుకోకుండా హృదయపూర్వకంగా ఈశ్వరుడిని మనలో ఎవరైనా ప్రేమిస్తున్నామా? లేదు. వాటివలన లోకానికి సంబంధించిన విషయాలు కొన్ని నెరవేరవచ్చుకాని మనకు మోక్షం లేదు, శాంతి లేదు, నిర్వాణసుఖం లేదు. మనకు అసలు ఒక ప్లానింగ్ లేదు, దీర్ఘదృష్టి లేదు. ఈ రోజు మనకు కడుపునొప్పిగా ఉంటే దేవుడు ఈ కడుపునొప్పి తగ్గిస్తేచాలు, ఇంకేమీ అక్కరలేదు అనుకొంటాము. మీరు మహాపండితులను చూడండి, ధనవంతులను చూడండి, రాజ్యాలను పాలించే రాజులను చూడండి ఎక్కడో ఒకచోట, ఏదో రూపంలో వారిని దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. కారణం ఏమిటి అంటే మనం కానిదానితో తాదాత్మ్యం ఉన్నంతకాలం తాత్కాలికంగా మనకు దుఃఖం లేనట్లు అనిపించినా మనిషికూడా నీడ వెంటాడినట్లు ఆ జీవుడిని దుఃఖం వెంటాడుతుంది. శరీరం చనిపోయేలోపు నూటికి 99 పాళ్ళు కాదు, నూటికి నూరు పాళ్ళు ఆత్మానందంలో, ఆత్మశాంతిలో ఎవడైతే ఓలలాడుతున్నాడో వాడికి మాత్రమే పునర్జన్మ లేదు, మిగతావారినందరినీ పునర్జన్మ వెంటాడుతూనే ఉంటుంది. వాసనను జయించటం మీరు అనుకొన్నంత తేలికకాదు, ఏవో చిట్కాల వలన వాసన నశించదు. దీనికి భగవంతుడు గీతలో అభ్యాసము, వైరాగ్యం చెప్పాడు. పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ప్రతీవాడి మనస్సు ఏదో లోకానికి సంబంధించిన విషయాల గురించి ఆలోచిస్తూ ఉంటుంది. మనస్సు ఇప్పుడు ఏ విషయాలనయితే చింతిస్తోందో ఆ విషయాలలో నుండి మనస్సును మళ్ళించి, ఆ మనస్సుతోటే భగవంతుడిని చింతిస్తూ ఉంటే అప్పుడు భగవదభిముఖంగా నీ మనస్సు ప్రయాణం చేస్తుంది, అది అభ్యాసము. మనం ప్రయత్నం చేసినా సక్సెస్ అవ్వకపోవటానికి కారణం మనకు ఉండ వలసినంత వైరాగ్యం లేదు. నిజంగా వైరాగ్యం ఉన్నవాడికి అసలు లోకవిషయాల మీద వాడి మనస్సు వాలదు. మనం దేహాన్ని, మనస్సును, బుద్ధిని ప్రోపర్‌గా ఉపయోగించుకోలేక పోతున్నాము. మనది విషయాలకు పరిమితమైన బుద్ధి, ఈ విషయబుద్ధికి ఆత్మజ్ఞానం రాదు. చిలుకలు మనం రామ అంటే రామ అంటాయి, కృష్ణా అంటే కృష్ణా అంటాయి. అక్కడ మనస్సు ఉండదు, ఎందుకు అంటోందో దానికి తెలియదు. మనం కూడా అలా యాంత్రికంగా తయారయ్యాము. భజన చేస్తే యాంత్రికంగా చేస్తాము, భగవంతుడికి ఏదైనా అర్చన చేస్తే యాంత్రికంగా చేస్తాము, అక్కడ మనస్సు ఉండదు, ప్రేమ ఉండదు, శాంతి ఉండదు, ఆప్యాయత ఉండదు. జీవితాలు ఇలా యాంత్రికంగా

వెళ్ళిపోతున్నాయి, ఏదోరోజున యాంత్రికంగా చనిపోతాము. సర్వం క్షణికం. మనం అనుభవించే లోకానికి సంబంధించిన సుఖాలు క్షణికం, మన అనురాగాలు క్షణికం, మరణం క్షణికం. మీకు ఏదైనా సంతోషం రావచ్చు, సంతోషానికి కారణాలు ఉండవచ్చు. అది పెర్మనెంట్‌గా ఉండదు, అదీ క్షణికమే. లోకంలో సర్వం క్షణికం. మీకు అదృష్టం పెర్మనెంట్‌గా ఉండదు, దురదృష్టం పెర్మనెంట్‌గా ఉండదు, ఇది కూడా క్షణికమే. ఈ అదృష్టం, దురదృష్టం మనస్సుకే, దేహానికే, ఈ రెండూ మనం కాదు, అక్కడికి మన మనస్సు ఎదిగి వెళ్ళటం లేదు. మీకు ఏవైనా కోరికలు ఉన్నా, వాసనలు ఉన్నా దేహంతో, మనస్సుతో, బుద్ధితో తాదాత్మ్యం ఉన్నంతకాలం అవి ఎంతోకొంత పెరుగుతూ ఉంటాయి కాని అవి నశించవు. అందుకే అభ్యాసం అవసరం. ఒక విషయం మీరు బాగా గుర్తుపెట్టుకోండి. మీరు పాలకొల్లులో ఉన్నారా? నర్సాపురంలో ఉన్నారా? లేకపోతే హిమాలయాలలో ఉన్నారా అనేది ముఖ్యం కాదు. సబ్జెక్టు మీరు బాగా అర్థం చేసుకోండి. నేను హిమాలయపర్వతాలకు పారిపోతాను అనుకోండి, అక్కడ ఏదో గుహలో కూర్చొంటాను అనుకోండి, అభ్యాసం ఏమీ చేయను అనుకోండి, దాని వలన ప్రయోజనం ఏమీ లేదు. మన ఇంటి దగ్గర మనం ఉండి, మన పని ఏదో మనం శ్రద్ధగా చేసుకొంటూ అభ్యాసం చేసుకొంటాము అనుకోండి. హిమాలయపర్వతాలలో ఆ గుహలో ఉన్నవాడికంటే ముందు మనం బాగుపడతాము. అభ్యాసం లేనప్పుడు గుహలలో కూర్చొన్నా, సన్యాసాశ్రమంలో ఉన్నా ప్రయోజనం లేదు. నీవు గృహస్థాశ్రమం లో ఉన్నావా? సన్యాసాశ్రమంలో ఉన్నావా? అనేది ముఖ్యం కాదు. నీ అభ్యాసం ఎలా ఉంది అనేది ముఖ్యం. మన మనస్సు యొక్క చాపల్యం తగ్గించటం కోసం, లోకంతో సంబంధం లేకుండా మనో దేహములతో సంబంధం లేకుండా ముగింపులేని శాంతిని, ఆనందాన్ని మనకు అందించటం కోసం అనేక సందేశాలు, అనేక ఉపదేశాలు. మనచేత చూడబడే ఈ ప్రపంచం అనిత్యం, ఇది క్షణికం, ఎవరూ నావారు కాదు, నేను ఎవ్వరి వాడనూ కాదు అనుకొంటూ భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకోవాలి. ఈ దేహం చనిపోతే ఏముంది, ఈ తుక్కును తీసుకొనివెళ్ళి పడేస్తారు. కళ్ళు మూసాము అనుకోండి ఎక్కడో సమాజం గొడవ వదిలి వేయండి, ఇంట్లో వారికి మనకు ఏమీ సంబంధం లేదు, ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. అనిత్యమైన ప్రపంచంలో దుఃఖపూరితమైన ప్రపంచంలో మనం ఉన్నాము. ఇది క్షణికం, ఇది అశాశ్వతం. ఇది దుఃఖాలయం అని అర్థం

చేసుకొని కళ్ళు మూస్తే ఒకరికి ఇంకొకరికి ఏమీ సంబంధం లేదు అని ఎరుకకలిగి నీపని నువ్వు చేసుకో. అంటే అందరితో పాటు పనిచేసుకొంటూ ఏదోరోజున చావు వస్తుంది కదా, ఆ చావు వచ్చినప్పడు ఏమీ ప్రయాసలేకుండా, జాగ్రత్తగా ఈ శరీరంలో నుండి ఎలా విడిపోవాలో ఇప్పటినుండి నీవు ట్రైనింగ్ పొందాలి, అదే సాధన. ఎప్పడూ మీరు ఒకటి దృష్టిలో పెట్టుకోండి. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా కూడా మీ నిశ్చలత్వం, నిర్మలత్వం, ఏకాగ్రత, వినయం, శాంత చిత్తం ఎన్నడూ విడిచిపెట్టవద్దు. మేము సంవత్సరాల తరబడి యోగాభ్యాసం చేస్తున్నాము అని కొంతమంది చెపుతూ ఉంటారు కాని ఆ ముఖంలో నిశ్చలత్వం ఉండదు, నిర్మలత్వం ఉండదు, చూపులో శాంతి ఉండదు, మాటలో సౌందర్యం ఉండదు మరి ఆ యోగం ఎందుకు చేస్తున్నట్లు? మీరు నిశ్చలంగా ఉండగలిగితే, నిర్మలంగా ఉండగలిగితే, శాంతచిత్తంతో ఉండగలిగితే, ధర్మం పట్ల గౌరవం కలిగిఉంటే, కర్తృత్వం లేకుండా కర్మ చేస్తూ ఉంటే మన ప్రవర్తనలో జ్ఞానం వస్తుంది, మన ప్రవర్తనలో శాంతి వస్తుంది అంతేగాని శాంతి ఎక్కడో ఉంది అని అనుకోవద్దు. మీరు చాలా అభివృద్ధిలో ఉన్నారు అనుకోండి. మీకు ఎవరంటే బాగా ఇష్టమో వారిని మీ అంతటి వారుగా చేయాలని, పెద్దవారిగా చేసేయాలని మీకు అనిపిస్తుంది. అలాగే భగవంతుడికి మనం అంటే బాగా ఇష్టం కాబట్టి ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితికి మనలను తీసుకొనిపోవాలని ఆయన చూస్తున్నాడు. భగవంతుడు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడు అంటే ఆయన ఎంత సుఖాన్ని, ఆనందాన్ని అనుభవిస్తున్నాడో, అటువంటి స్థితిని మనచేత పొందింపచేయాలని చూస్తున్నాడు, ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వటానికి చూస్తున్నాడు. భగవంతుడు అంతటా ఉన్నాడు, ఆయనలేని చోటు అంటూ లేదు, అటువంటి స్థితికి తీసుకొనిపోవటం కోసం భగవంతుడు మనకు బోధిస్తున్నాడు. ఇవి కాలక్షేపం కోసం చెప్పిన మాటలు కాదు, అహంకారం కోసం చెప్పిన మాటలు కాదు. మీ అమ్మాయి అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి, వారి కుటుంబాన్ని ఎలా బాగుచెయ్యాలి, ఎలా అభివృద్ధిలోనికి తీసుకొనిరావాలి అని ఒక్క నిద్రలో తప్పించి మిగతా టైము అంతా దాని గురించే ఆలోచిస్తారు. ఒక హ్యూమన్ మైండ్ ఇంకో మనిషిని ఇంత ప్రేమించినప్పడు డివైన్ మైండ్, ఆ చైతన్యం, ఆ ఈశ్వరుడే మనలను ప్రేమిస్తూ ఉంటే, ఆయన ఒడిలో మనకు స్థానం ఇస్తూ ఉంటే, ఆయన హృదయంలో మనకు స్థానం ఇస్తూ ఉంటే మనకు జ్ఞానం రాకుండా ఆపుచేసుకోగలమా?

మనకు అసాధ్యం ఉంది కాని భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు.

మీకు ఎంత ధనం ఉన్నా, ఎంత పాండిత్యం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా అది మీ సొంతం కాదు. అంతా భగవంతుడిదే. ఇందులో మీ సొంతం ఏమీ లేదు, అంతా భగవంతుడు మనకు ఇచ్చినదే. మన అహంభావన వలన, మనకు వివేకం లేకపోవటం వలన యిదంతా మనం సొంతం అనుకొంటాము. అందుచేత మనకు గర్వం వస్తోంది. భగవంతుడు ఇవ్వకుండా మనకు ఏదీ రాదు. ఈ జన్మలో బాగా ఉన్నామని రాబోయే జన్మలో కూడా బాగా ఉంటాము అనుకోకండి. ఇవాళ శరీరం ఆరోగ్యం బాగుంది, రేపు ఎలా ఉంటుందో మనకు తెలియదు. కర్మఫల దాత ఈశ్వరుడే. ఏమండీ మేము సంపాదించినది వాళ్ళు తింటూ అలా పడిఉంటే పదితరాలు వరకూ వెళ్ళిపోతుంది అని కొంతమంది అంటారు. అసలు మనం డబ్బు సంపాదించినప్పుడే అది ఎప్పుడు పోవాలో కూడా నిర్ణయింపబడి ఉంటుంది. అది మనకు తెలియదు. పెద్ద పెద్ద సామ్రాజ్యాలే అంతరించిపోయాయి, మనం సంపాదించిన డబ్బు ఎంత? మన శరీరం ఈ భూమి మీదకు వచ్చినప్పుడే అది ఎప్పుడు మరణించాలో నిర్ణయింపబడి ఉంటుంది. మనిషి పుట్టాడు అంటే చనిపోయాడనే అర్థం, ఏదయినా సరే వచ్చింది అంటే అది పోయిందనే అర్థం. నీ శరీరం అంటే నీకు ఇష్టం, ఇష్టం ఉన్నా ఫరవాలేదు ఈ దేహమే ఆత్మ, దేహం తప్పించి ఏమీలేదు అనుకోవటం. దేహం అంటే నీకు ఎంత ఇష్టం ఉన్నా అది పోతుంది. ఎందుచేతనంటే అది నీవు కాదు. ఈ లోకాన్ని మనం ఏదో గొప్పగా చూస్తాము, కృష్ణుడు ఈ లోకం గురించి ఏమన్నాడు అంటే ఇది అశాశ్వతం, అనిత్యం అని చెప్పేసి వదిలేయలేదు. ఇది దుఃఖాలయం అన్నాడు. ఎటుచూసినా ఇక్కడ దుఃఖమే. పుట్టుక దుఃఖం, మరణం దుఃఖం, జబ్బు దుఃఖం, నీవు ఏదో ఊహించు కొంటూ ఉంటావు, అదీ దుఃఖమే. నీ మనస్సును, బుద్ధిని నియమించుకోవాలి. ఆత్మజ్ఞాన సముపార్జనకు అవి ఫిట్ అయ్యేలా చూసుకోవాలి. నేను 1987లో మద్రాసులో ఒక డాక్టరు దగ్గరకు వెళ్ళాను, ఆయన చూసారు మందులు వ్రాసి ఇచ్చారు, వంద రూపాయలు తీసి ఇచ్చాను. ఏమండీ నేను మీకు చేసిన పనికి 50 రూపాయలు సరిపోతాయి అని మిగతా 50 రూపాయలు తిరిగి నాకు ఇచ్చేసారు. వర్క్ ఫర్ లవ్. నువ్వు ప్రేమకోసం చెయ్యి. కేవలం జీతం కోసం పనిచేస్తే నీకు జీతం వస్తుంది, పొట్ట వెళ్ళిపోతుంది, అసలు సున్న. నీకు మోక్షసుఖం కావాలంటే ప్రేమకోసం పనిచెయ్యి, నువ్వు చేసిన పనికి డబ్బు తీసుకో, నీకు

పొట్ట ఉంది కాబట్టి దాని పోషణకు డబ్బు అవసరం. మేము ఇతరుల కోసమే పని చేస్తున్నాము, ఇతరుల కోసమే బతుకుతున్నాము అని కొంతమంది అంటారు, ఆ మాటలు నూటికి నూరుపాళ్ళు అసత్యం. మీకు డబ్బు ఉంటే పది రూపాయలు పెట్టుకోండి అంతేగాని వారికోసం మీరు బాడి చేసుకోవటం, కడుక్కోవటం ఇవన్నీ ఎందుకు? ఇతరులకోసం ఆలోచించేవారు, వారి కోసం బాధపడేవారు ఎక్కడో ఒక్కడో, ఇద్దరో ఉండవచ్చు కాని ఇదంతా కామన్ అని మనం అనుకోవటానికి అవకాశం లేదు. మంచిచూపు, మంచి ప్రవర్తన, మీరు సంపాదించు కొనే సంపాదనలో ధర్మం, ఒక నియమం ఉండాలి. అలా కనుక మీరు జీవిస్తూ ఉంటే ఇవన్నీ మిమ్మల్ని మోక్ష స్థితికి తీసుకొని వెళ్ళవని మీకు ఎవరైనా చెప్పారా? దీనిని చెప్పకుండా చెప్పటం అంటారు. ఈ దేవుడు, దెయ్యాల మాట వదిలి వేయండి. మనం మాట్లాడే మాట ఎప్పడూ మనకు దుఃఖాన్ని తీసుకొని రాకూడదు, ఇది బాగా గుర్తు పెట్టుకోండి. మనం చేతితో చేసే పని మనకు ఎప్పడూ దుఃఖాన్ని తీసుకొని రాకూడదు. ఎవరినయినా చూసి మనస్సులో అసూయపడతాము అనుకోండి, మంచిని కూడా చెడ్డగా చెపుతాము అనుకోండి ఇదంతా మన మనస్సులో వచ్చే వికారం, మనకు వచ్చే ఆలోచనలో ద్వేషభావం. మనం మాట్లాడే మాట ద్వారాగాని, చేసే పని ద్వారాగాని, మనకు వచ్చే ఆలోచన ద్వారా కాని ముందు మీకు దుఃఖం రాకుండా చూసుకోండి, తరువాత మిగతా పని దేవుడు చేస్తాడు. ఇప్పడు మన చేతిలో ఉన్న పని మనం చేద్దాము, దేవుడు చేసే పని ఆయన చేస్తాడు, ఆయనకు ఏమీ జ్ఞాపకం చేయనక్కరలేదు. ఏది ఎప్పడు జరగాలో అప్పడు జరుగుతుంది. నిజానికి దేవుడే కర్త, ఆయనే భోక్త. కాని మనకు కర్తృత్వం ఉంది కాబట్టి మనమే కర్త, మనమే భోక్త అనుకొంటున్నాము, నూటికి నూరుపాళ్ళు ఇదే మన దుఃఖానికి కారణం, అందుచేత మనం దుఃఖాన్ని అనుభవిస్తున్నాము. దేహంతోగాని, మనస్సుతోగాని, పరిస్థితులతో కాని లోపల తాదాత్మ్యం ఉంది అనుకోండి మనకు అశాంతి వచ్చేస్తుంది, వాడికి ఉన్న డబ్బు ఆపు చేయలేదు. మీకు వెయ్యి కోట్లు డబ్బు ఉన్నా ఆ డబ్బును పెట్టి శాంతిని కొనక్కోలేరు. ఈ లోకంలో డబ్బుతో కొనుక్కోవటానికి సాధ్యంకానిది ఒక్కటే ఉంది. అది శాంతి. ఎవరైనా శాంతిని కొనగలరేమో చూడండి. మనం శాంతి స్థానాన్ని పొందాలంటే మాట, చేత, మనస్సు ఈ మూడింటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మీరు డబ్బు దగ్గర కొంచెం అజాగ్రత్తగా ఉన్నా ఫరవాలేదు కాని మాట దగ్గర అజాగ్రత్త పనికిరాదు. మీరు ఇంటి దగ్గర

పనిచేసుకొనేటప్పుడు ఎప్పుడయినా బద్ధకం పనికి వస్తుందేమో కానీ మీ మనస్సును నియమించుకోవటంలో బద్ధకం పనికిరాదు. మన మాట, మన చేత, మనకు వచ్చే తలంపులు భవిష్యత్‌లో మనకు దుఃఖాన్ని తీసుకొని రాకూడదు, ఇది ముందు మనం తెలుసుకోవాలి. నీవు చెప్పే మంచి మాటలు, నీవు చేసే మంచి పనులు, నీకు వచ్చే మంచి తలంపులు నీ మనస్సులో ఉన్న మురికిని పోగొట్టవని, నీ మనస్సును శుభ్రం చేయవని, నిన్ను బాగుచేయవని, నిన్ను ఉన్నతస్థితికి తీసుకొని వెళ్ళవని నీకు ఎవరైనా చెప్పారా? సత్కర్మ నీ బుద్ధిలో ఉన్న మురికిని పోగొట్టదని నీకు ఎవరైనా చెప్పారా? నువ్వు సత్కర్మ చేస్తే నీకు చిత్తశుద్ధి కలుగు తుంది, నీ మనస్సు బాగుపడుతుంది. నీ ముక్కులో గాలి తిరుగుతున్నంత వరకు యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనిషికి ఎంతకాలం అయితే స్వార్థం ఉందో అంతకాలం వాడికి సంసారం వస్తుంది అని బుద్ధుడు చెప్పాడు. పై పెదిమ క్రింది పెదాన్ని పట్టుకొంటుంది కదా అలాగ నీ మనస్సును నీ మనస్సుతోటి పట్టుకొని దానిని నియమించుకో. ఎవడో వస్తాడు, ఉద్ధరిస్తాడు అని ఎంతకాలం కనిపెట్టుకొని ఉంటావు. నిన్ను నీవు బాగుచేసుకోవ టానికి ప్రయత్నం చేసుకో, నీ వివేకాన్ని పెంచుకో, సమానబుద్ధిని పెంచుకో, నీ మనస్సు యొక్క చాపల్యాన్ని తగ్గించుకో, ఇదంతా నీవు జాగ్రత్తగా కృషి చేసుకో, నీ కృషి ఫలిస్తుంది. నీ ప్రవర్తనను బట్టి నీకు డిగ్నిటీ వచ్చేస్తుంది. మనస్సుతో మనస్సును పట్టుకొని జాగ్రత్తగా నీ మనస్సును నియమించుకొన్నావు అనుకో, మనస్సుకు ఏకాగ్రత కుదిరింది అనుకో, పరిపూర్ణమైన ఏకాగ్రతే సమాధి. నువ్వు పని చేసుకో, పనిని విడిచిపెట్టవద్దు కాని ఇది అనిత్యం, ఇది క్షణికం అని నీ మనస్సులో అనుకోవటం మర్చిపోవద్దు. నీ మనస్సు బాగుపడింది అనుకో, నీ బుద్ధి శుద్ధి అయ్యింది అనుకో జ్ఞానం దానంతట అదే వచ్చేస్తుంది. ఎల్లమ్మతో మాట్లాడవద్దు, ఈ పని నీవు చేయవద్దు అని నీ మనస్సు చెపుతోంది అనుకో, అది వినవద్దు, మీ వివేకాన్ని కాపాడుకోండి. చేప ఏ విధంగా అయితే నీటికి ఎదురు ఈదుతుందో అలాగ నీ మనస్సుకు ఎదురు ఈదటం నేర్చుకో. మనస్సు ఎటు గంతు వెయ్యమంటే అటు గంతు వెయ్యకు. మీకు ఎప్పుడయినా దుఃఖం వచ్చింది అనుకోండి, రానివ్వండి. ఎప్పుడయినా అశాంతి వచ్చింది అనుకోండి రావద్దు రావద్దు అనకండి, అశాంతి వస్తే రానివ్వండి. అది మిమ్మల్ని ఒకరోజో, రెండు రోజులో పీడిస్తుంది. అప్పుడు కనిపించిన వారినల్లా తిట్టకుండా మీరు ఓర్పుగా ఉంటే ఆ దుఃఖమే, ఆ అశాంతే అందులోనుండి ఎలా

బయటపడాలో మీకు దారి చూపిస్తుంది, అది మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. వాసనను జయించాలి అని మనకు ఉంది కాని వాసనాక్షయం చాలా కష్టం. ఎందుచేతనంటే మనం వాటితో కలిసి ఉంటాము ఇంక వాసనలు ఎలా పోతాయి. అవి అణిగి ఉంటాయి కాని నిజంగా పోవు. వాసన నశించటానికి స్వప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, ఈశ్వరుని దయ ఉండాలి. ఈశ్వరుని దయ లేకుండా చిన్న వాసన కూడా నశించదు. పుట్టినది జడం, పుట్టనిది చైతన్యం. పుట్టినది మొద్దు, పుట్టనిది తెలివిగలది. మనకు పుట్టిన దానితో తాదాత్మ్యం ఉంది గాని పుట్టనిదానితో తాదాత్మ్యం మనకు లేదు. ఆ పుట్టని దానితో ఎవడైతే తాదాత్మ్యం పొందాడో వాడికి ఆభవసుఖం, పూర్ణసుఖం అందుతుంది, వాడికి శరీరం ఉంటే సుఖం, శరీరం పోతే సుఖం, లోకం కనిపిస్తే సుఖం, లోకం కనిపించకపోయినా సుఖం. జ్ఞానిని ప్రపంచం అంతా వదిలేసింది అనుకోండి వాడి సుఖం రవ్వంత కూడా తగ్గదు. కొంతమంది లక్షలాది జనం మధ్యన ఉన్నా సుఖంగానే ఉంటారు. కొంతమంది ఎక్కడో గుహలలోనికి వెళ్ళిపోయి ధ్యానం చేస్తున్నాము అని ఏడుస్తూ కూర్చొన్నవారు ఉన్నారు ఎందుచేతనంటే అక్కడ అభ్యాసం లేదు. నువ్వు సన్యాసాశ్రమంలో ఉన్నా, గృహస్థాశ్రమంలో ఉన్నా అభ్యాసం చేయాలి. నువ్వు ఎక్కడ ఉన్నావు అన్నది ముఖ్యం కాదు, నువ్వు చేస్తున్న అభ్యాసం ఏమిటి? ఎంతవరకు అభ్యాసం చేస్తున్నావు అనేది ముఖ్యం. మీరు ఏదైనా ఒక మంచిపని చేస్తున్నారు అనుకోండి, అది విసుగ్గా చేయకూడదు, ఎలా చెయ్యాలి అంటే ప్రేమతో చెయ్యాలి, నిర్మలత్వంతో చేయాలి, శాంతచిత్తంతో చేయాలి, అణిగి చేయాలి, వంగి వంగి చేయాలి కాని ఎగిరి ఎగిరి పడకూడదు, కర్మఫలకాంక్ష లేకుండా చేయాలి. ఆ రకంగా ఏ పని చేసినా అది మంచి పనే. నువ్వు చేసేపని సౌమ్యంగా ఉండాలి, అది పదిమందికి ఉపయోగపడాలి. నీకు కుదురు లేకుండా, శాంతి లేకుండా, ఏవో గొప్పలకోసం పని చేస్తావు అనుకో అదంతా చెడ్డపని. మీరు బాహ్యంగా ఒక మంచిపని చేసారు అనుకోండి. మీరు చేసిన మంచి పనిలో ప్రేమలేదు అనుకోండి, శాంతి లేదు అనుకోండి, అది మంచి పని అయినా అది ఎవరికోసం అయితే చేసారో ఆ పని వారిని సుఖపెట్టదు. ఇంకోటి మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మన కుటుంబసభ్యులు మనకు అశాంతి తీసుకొని వస్తారు, సమాజపరంగా అశాంతి వస్తుంది, ప్రకృతి పరంగా అశాంతి వస్తుంది, ఒకవేళ ఈ కారణాలు లేకపోయినా నీ దేహప్రారబ్ధం కూడా అశాంతిని తీసుకొని

వస్తూ ఉంటుంది. ఇన్ని రకాలుగా అశాంతి వస్తున్నప్పటికీ నీవు శాంతచిత్తం కోల్పోకుండా ఉంటే అప్పడు భగవంతుని దయ నీకు కలుగుతుంది. అయ్యోపాపం వీరికి దుఃఖకారణాలు చాలా ఉన్నాయి. దుఃఖకారణాలు ఇన్ని ఉన్నా దుఃఖం లేకుండా ఉంటున్నారు, అశాంతి కారణాలు ఇన్నిఉన్నా శాంతిగానే ఉంటున్నారు. వీరికి నా దయను చూపించకపోతే ఎలాగ అని భగవంతుడు ఆయన దయను చూపించి మీకు మోక్షాన్ని ఇస్తాడు. ఏదో నామ జపం చేసుకోవటం, గుడి చుట్టూ తిరగటం సాధన అనుకొంటున్నారు. మీకు అశాంతికి కారణాలు ఉన్నప్పటికీ అశాంతి లేకుండా శాంతిగా ఉండగలుగుతూ ఉంటే అది కూడా సాధనలో ఒక భాగమే, అది ఉదాత్తమైన సాధన, దాని వలన ఈశ్వరుని దయకు పాత్రులవుతారు. అన్నాన్ని గరిటతో కదుపుతారు. అన్నాన్ని ఏ గరిటితో తిప్పతున్నారో ఆ గరిట శుభ్రంగా ఉండాలి. మీరు ఏదయినా ఒక లక్ష్యం పొందాలనుకొన్నప్పడు, ఒక మంచి చేయాలనుకొన్నప్పడు మీరు అవలంభించే మార్గం కూడా మంచిగా ఉండాలి, సరళంగా ఉండాలి, నిదానంగా ఉండాలి. మీరు చేసే పనిలో సంకల్ప శుద్ధి కూడా ఉండాలి. గమ్యంలో శుద్ధి ఉంటే సరిపోదు, ప్రయత్నంలో కూడా శుద్ధి ఉండాలి, అదే నిజమైన కృషి. మీ మనస్సు నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే అదే నిజమైన శుచి. మీరు నిర్మలంగా, నిశ్చలంగా ఉండలేకపోతున్నారు అనుకోండి, ప్రతీ చిన్న సంఘటనకు ఆందోళన పడుతున్నారు అనుకోండి, కంగారు పడుతున్నారు అనుకోండి, మీ బుద్ధిలో శుచి లేదని అర్థం, శరీరానికి శుచి ఉంటే సరిపోదు, బుద్ధికి కూడా శుచి ఉండాలి. బుద్ధికి కనుక శుచి ఉంటే ప్రతీ చిన్న సంఘటనకు ఆందోళన రాదు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు నిజంగా ఎదుటివారికి ఉపకారం చేద్దాము అనుకొంటున్నావు అనుకో, నీ ఉద్దేశ్యం మంచిదే అనుకో కాని నువ్వు చేసే పని అహంకారంగా ఉంది అనుకో నీ పని నెరవేరదు, నీకు బాడి అంటుకొంటుందికాని పని సున్న. నువ్వు అజ్ఞానంలో ఉన్నావు అనుకో, అశాంతిలో ఉన్నావు అనుకో, అహంకారంలో ఉన్నావు అనుకో లోకానికి ఏదయినా ఉపకారం చేయాలన్నా నీవల్ల ఉపకారం జరగదు. నువ్వే ఆందోళనలో ఉన్నప్పడు ఎదుటివారిని ఆందోళనలేనిస్థితికి ఎలా తీసుకొని వెళ్ళగలవు. అది నీకు సాధ్యం కాదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు ఎరుకలోనికి వచ్చే వరకు మనం కానిదానిని మనం అని అనుకొంటూనే ఉంటాము, మన కూడా అశాంతి వస్తూనే ఉంటుంది. మీరు కష్టపడి జ్ఞానం సంపాదించారు అనుకోండి ఇతరులకు ఎవరికీ

మనం ఏమీ సహాయం చేయకూడదు అనుకొన్నా అది ఆగదు. నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించావు అనుకో నదికి వరద వచ్చినప్పుడు ఆ ప్రవాహం సుడులు తిరుగుతూ ఎంత వేగంగా వెళ్ళిపోతూ ఉంటుందో అంతవేగంగా నీ కళ్ళు చూడటానికి కూడా అందని వేగంతో నీ ద్వారా సమాజానికి శాంతి, సుఖము, ఆనందం ప్రవహిస్తూ ఉంటుంది. నేను ఆపు చేసుకోవాలి, నేను ఆనందం ఎవరికీ ఇవ్వకూడదు, నేనే జుర్రుకోవాలి అని నువ్వు అనుకొన్నా కుదరదువయ్యా పుల్లయ్యా అంటున్నారు. మనం గోదావరి నది దగ్గరకు వెళ్ళి నువ్వు సముద్రంలోనికి వెళ్ళకు, నేను నిన్ను చూడటానికి వచ్చాను, ఒక గంటసేపు ఇక్కడే ఆగు అంటే అసలు మన మాట వినదు, మన వంక చూడదు, అదే ప్రవాహం, జ్ఞాని పరిస్థితి కూడా అంతే. జ్ఞానం యొక్క ప్రవాహం అలా సాగుతోంది కాబట్టే, ఆ ప్రకారం కొంతమంది మహర్షులు, మహాత్ములు జీవిస్తున్నారు కాబట్టే ఉపనిషత్‌లలో చెప్పిన మాటలు, గీతలో చెప్పిన మాటలు నిజమే అని మనకు అనిపిస్తుంది, అలా ఎవరూ జీవించటం లేదు అనుకోండి, ఆ వస్తువు ఎవరికి అందటం లేదు అనుకోండి ఏవో పురాణం మాటలు, అవి నిజాలు ఏమిటి అనిపిస్తుంది. ఆ మాటల ప్రకారం ఎవరో ఒకరు జీవిస్తున్నారు కాబట్టీ ఆ ప్రవాహం అలా నడుస్తోంది. అందుచేత ఇతరులకోసం కాదు మీ కోసమే మీరు కష్టపడి కష్టపడి, సహించి, ఓర్పుతో జ్ఞానాన్ని సంపాదించారు అనుకోండి, అది నువ్వు పొందాక, ఎవరికి ఇవ్వకూడదు మనమే జుర్రుకోవాలి అని నువ్వు అనుకొన్నా కుదరదు, నీ కప్ప పొంగిపోయి అది సమాజంలోనికి ప్రవహిస్తూ ఉంటుంది, నువ్వు విశాలమయిపోతావు. గడ్డిపరక ఎంతమంచిది అంటే మనం దానిని కాలికింద పెట్టి తొక్కినా అది ఏమీ అనదు, అలా అణిగి ఉంటుంది, ఒకవేళ దానికి కుట్టటం చేతనయినా కుట్టదు, జ్ఞాని యొక్క స్వభావం అట్టిది. సూర్యుడిని చూడటం మనకు ఇష్టంలేదు అనుకోండి, మనం కళ్ళు మూసుకొంటే సూర్యుడికి వచ్చే నష్టం ఏమిలేదు. నదీ ప్రవాహాన్ని ఎవడు ఆపుచేయగలడు. అదే ఏసుక్రీస్తు చెప్పాడు కొండ మీద దీపం పెట్టి ఆ దీపాన్ని ఎవరు చూడకూడదు అనుకొంటే ఆ దీపం మనకు కనిపించటం మానుతుందా? జ్ఞాని యొక్క వైభవం కూడా అటువంటిదే. ఒకసారి ఎవరో బుద్ధుడిని దేవుడి గురించి అడుగుతున్నారు. ఆ ప్రక్కన ఉన్నవాడు ఏమి అంటున్నాడు అంటే ఈ బుద్ధుడి ద్వారా ప్రవహించే ప్రేమ, ఈ బుద్ధుడి ద్వారా ప్రవహించే జ్ఞానం, ఈ బుద్ధుడి ద్వారా ప్రవహించే శాంతి ప్రవాహం ముందు ఒకవేళ దేవుడు అంటూ ఉంటే ఈ ప్రేమ ప్రవాహం కంటే గొప్పగా ఉంటాడా?

మనందరకు దూరపుకొండలు అంటే నునుపు, ఎక్కడో దేవుడు ఉన్నాడు అంటే నమ్ముతాము కాని మన హృదయంలో దేవుడు ఉన్నాడు అంటే మనకు నమ్మకం కుదరటం లేదు.

బుద్ధుడు ఏమని చెపుతున్నాడు అంటే మీరు ఏ విషయంలోను అతిగా వెళ్ళవద్దు, మీ పనులు మీరు చేసుకోండి, ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికి పారిపోనక్కరలేదు. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకొంటూ ధర్మమార్గాన్ని విడిచిపెట్టకుండా, అందరూ అలా ఉన్నారు మనం కూడా అలా ఎందుకు ఉండకూడదు అని ఇతరులను కాపీ కొట్టకుండా నీ మార్గంలో నువ్వు ప్రయాణం చెయ్యి, నువ్వు ఒంటరిగానే వెళ్ళు, కూడా జనం ఎందుకు అంటున్నాడు. యు వాక్ ఎలోన్. నిర్వాణసుఖాన్ని పొందటానికి నువ్వు ఒక్కడివే నడిచి వెళ్ళు, నీ కూడా జనం ఎందుకు? నీ కూడా వచ్చిన వారు వస్తారు, రాని వారిని వదిలెయ్యి. నువ్వు చనిపోయి నప్పుడు నీ కూడా పదిమంది వస్తున్నారా? నువ్వు వందకోట్లు సంపాదించి ఎవడికైతే ఇచ్చావో వాడు కూడా మరణానంతరం నీ కూడా రాడు, కనీసం వల్లకాటికి కూడా రాడు, అది ప్రపంచం యొక్క స్థితి, అది సమాజం యొక్క స్థితి. నీ పద్ధతిలో నువ్వు వెళ్ళిపో, నీకు కావలసి ఉంటే సత్పురుషుల సహకారం తీసుకో, నీకు సహకారం లేదు అనుకో నీ మార్గంలో నీవు ఒంటరిగా నడిచి వెళ్ళిపో, నిర్మలంగా నిశ్చలంగా వెళ్ళు, నీ మార్గం నువ్వు విడిచిపెట్టవద్దు. మన విగ్రహాలు రోడ్డు ప్రక్కన పెడతారు అనుకోండి, మన పేర్లు పుస్తకాలలో వేస్తారు అనుకోండి. మనకు శాంతి లేనప్పుడు, మనకు సుఖం లేనప్పుడు ఆ పుస్తకాలలో పేర్లు, విగ్రహాలు ఇవన్నీ ఏమి చేసుకొంటాము. మీ బుద్ధి నిర్మలంగా నిశ్చలంగా ఉంటేనే అది శుచి, లోపలశుచిగా ఉన్నామో లేదో మనం చూసుకోవాలి. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఈ శరీరం బయటకు వెళ్ళిపోతుంది. ఎందుచేతనంటే అది మనం కాదు. భగవంతుడి నామాన్ని ఎలా జ్ఞాపకం పెట్టుకొంటున్నారో, సాధనకు ఇది కూడా అలా జ్ఞాపకం పెట్టుకోండి. సాధన ఎందుకు అంటే ఇప్పుడు మనం ప్రకృతి ఒడిలో ఉన్నాము. ప్రకృతి ఒడిలోనుండి జంప్ చేసి శివుడి ఒడిలోనికి వెళ్ళటానికి మనం చేసే ప్రయత్నమే సాధన.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-08-05, వడ్లూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఉన్న వస్తువు ఒక్కటి అంటే ఒక్కటే. దానిని అనేకమంది అనేక పేర్లతో పిలిచారు, ఎన్ని పేర్లు పెట్టి పిలిచినా వస్తువు ఒక్కటే. సాధన అనేది మీరు ఎలా చేయాలి అంటే మీరు

కష్టపడి ఏదో పనిచేస్తారు, దానికి ఫలితం వస్తుంది అనుకోండి, అప్పుడు మీకు చాలా ఆనందం వస్తుంది. ఫలితం వచ్చినప్పుడు మీకు ఆనందం ఎలా ఉందో, సాధన చేసేటప్పుడు కూడా అంత ఆనందంగా, అంత ఇష్టంగా, అంత తియ్యగా జరుగుతూ ఉంటే పని తేలిక అవుతుంది. సాధన చేసేటప్పుడు మీకు కష్టం ఉండదు, అది అనుభవానికి వచ్చినప్పుడు ఎంత తియ్యగా ఉంటుందో సాధన కూడా అంత తియ్యగా ఉంటుంది. ఇవన్నీ మీరు బాగా నేర్చుకుంటే మీరు తరిస్తారు. మనకు చేతకాకపోతే నేర్చుకోవాలి కాని నేర్చుకోవటానికి సిగ్గుపడకూడదు. సిగ్గు ఉన్నవాడికి, శ్రద్ధ లేనివాడికి చదువురాదు. కర్మ చేస్తూ కర్మలోనుండి విడుదల పొందాలి. అంటే కర్మ చేసేటప్పడే ఆ కర్మలో నుండి ఎలా విడుదల పొందుతామో ఆ పద్ధతిలోనే కర్మ చేయాలి. ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే ఆ పని మనలను బంధించదు, అది మనకు మోక్షాన్ని ఇస్తుంది. అంటే నువ్వు మాట్లాడేమాట, నువ్వు చేసే పని, నువ్వు చేసే సాధన అంతా కూడా నీవు మోక్షం పొందటానికి సహకరించాలి. మీ ఇంట్లో ఉన్న వ్యక్తులకు కూడా వాడు భగవంతుడు ప్రతినిధి అనుకొని సేవ చేయాలి కాని మోహం పెట్టుకొని చేయకూడదు. మనం కర్తలేని కర్మ చేస్తూఉంటే, అహంభావన లేకుండా పనిచేస్తూ ఉంటే ఆ పని వలన మనం పవిత్రులమవుతాము. మనం చేసేపని మనలను బంధించకూడదు, మనం చేసే పని మనలను బంధంలోనుండి విడుదలచేసి, మనం మోక్షం పొందటానికి సహకరించాలి. ఇవన్నీ తెలుసుకొని చేస్తే మనం భౌతికంగా బాగుపడతాము, ఆధ్యాత్మికంగా మనకు పురోగతి ఉంటుంది. భగవంతుడు మనకు అన్ని అవకాశాలు ఇచ్చాడు అనుకోండి, వాటినిచూసి గర్వం తెచ్చుకోకూడదు. ఎగిరిఎగిరి పడేవాడికి ఏమీ రాదు, చివరకు బూడిద మిగులుతుంది. అణిగిఉన్నవాడికి ఐశ్వర్యం కలుగుతుంది, ఒకోసారి పూర్వజన్మ సుకృతాన్ని బట్టి మీకు అనేక అవకాశములు వస్తాయి, వాటినిచూసి పొంగిపోకూడదు, అవిఅన్నీ నిజం కాదు. ఒకవేళ మీ రోజులు బాగావెళ్ళిపోతూ ఉంటే అది మంచిస్వప్నం, రోజులు బాగావెళ్ళకపోతే అది చెడ్డస్వప్నం, అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే, రెండూ నిజం కాదు. కాని నిజం అనేది ఒకటి ఉంది, అది మన హృదయంలోనే ఉంది. ఏదైతే మనం నేను నేను అంటున్నామో అది నిజమైననేను కాదు. అందుచేత రమణమహర్షిగారు ఏమని చెప్పారు అంటే ఏదైతే నువ్వు నేను నేను అంటున్నావో ఆ నేను నువ్వు కాదని ముందు అలవాటు చేసుకో. ఆ నేనుతో నీవు కలిసిపోవద్దు. నీకు ఏదైనా మంచిజరిగితే నువ్వు పొంగిపోకు, మంచిజరగకపోతే

కుంగిపోవద్దు, మంచి అయినా, చెడ్డ అయినా అహంకారానికే. అహంకారానికి మేత తగ్గించు. అహంకారానికి మేత తగ్గిస్తూ వెళితే అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది, అప్పుడు నీ హృదయంలో ఉన్న నిజం నీకు వ్యక్తమవుతుంది. కర్మఫలం మీద కాంక్ష లేకుండా పనిచేస్తూ ఉంటే పని పూర్తి అవుతుంది, లోపల పవిత్రులమవుతాము. అహంకారం లేకుండా, గర్వం లేకుండా మనం పనిచేస్తే ఆ పని మనకు సుఖాన్ని తీసుకొని వస్తుంది. కౌరవులకీ, పాండవులకీ రాజీ కుదరలేదు, యుద్ధం ఖాయం అయిపోయింది. మా పక్షానికి రండి, మా పక్షానికి రండి అని ధుర్యోధనుడు, అర్జునుడు అందరి రాజులను అడుగుతున్నారు. ఇద్దరూ కృష్ణుడి దగ్గరకు వెళ్ళారు. కృష్ణుడు మాయావి, వారు ఇద్దరూ వస్తారని ఆయనకు తెలుసు. ఆయన దొంగ నిద్రపోతున్నాడు, ఆయన పాదాల దగ్గర ఒక కుర్చీ, తల దగ్గర ఒక కుర్చీ వేసాడు. ధుర్యోధనుడు ముందుగా వచ్చాడు. నేను రారాజును పాదాల దగ్గర కూర్చోవటం ఏమిటి అని గర్వం వచ్చింది, తల దగ్గర ఉన్న కుర్చీలో కూర్చున్నాడు, వాడు అక్కడ పరమాత్మను గుర్తించలేకపోతున్నాడు, భౌతికాన్నే గుర్తిస్తున్నాడు. తరువాత అర్జునుడు వచ్చాడు ఆయన పాదాల దగ్గర ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. దొంగ నిద్రపోయేవాడు మేల్కొన్నాడు. ముందుగా పాదాల దగ్గర ఉన్నవాడు కనిపిస్తాడు కదా, ఆయనకు అర్జునుడు కనిపించాడు. అర్జునా! ఏమిటి ఇలా వచ్చావు? అని అడిగాడు. భారతయుద్ధం జరుగుతోంది కదా నీ సహాయం కోసం వచ్చాను అన్నాడు. ఒకవేళ వాడి తరుపుకు వెళ్ళిపోతాడేమో అని ధుర్యోధనుడు కంగారుపడిపోయి వాడు ముందు రాలేదు, ఇక్కడకు నేను ముందు వచ్చాను అని చెప్పాడు. మీరు ఇద్దరూ వచ్చారు, ఇద్దరూ మాకు కావలసిన వారే. నేను ఏమీ యుద్ధం చేయను, నేను ఒక్కడినే ఒక పక్షాన ఉంటాను, నా సైన్యం అంతా ఒక పక్షాన ఉంటుంది అని చెప్పాడు. నీ సైన్యం అంతా నాకు ఇచ్చేయి అని ధుర్యోధనుడు చెప్పాడు. నువ్వు యుద్ధం చేయకపోయినా నీవు మా వెంట ఉంటే సరిపోతుంది అన్నాడు అర్జునుడు. ఇక్కడ మీరు గ్రహించండి. ధుర్యోధనుడికి భౌతికం కావాలి, క్వాంటిటీ కావాలి, ఒకటి లేని సున్నలు కావాలి. ఒకటిలేని సున్నలు వంద సున్నలు కూడినా సున్న వస్తుంది కాని ఒకటి రాదు. అర్జునుడికి చైతన్యం కావాలి. నేను యుద్ధం చేయను నీ రథంతోలతాను అని చెప్పాడు, అర్జునుడి రథం తోలాడు కాబట్టి ఆయనను పార్థసారథి అన్నారు. ఓ కృష్ణా! నీవు అర్జునుడికే సారథిగా ఉండటం కాదు, ఈ జీవకోటి అందరికీ సారథిగా ఉండాలి అని వివేకానందుడు అన్నాడు. నీవు

అర్జునుడి ప్రక్కన కూర్చొని మురళి ఊదుతావేమో అనుకొన్నాను కాని నీవు రథం తోలుతాను అంటున్నావు, బండి తోలటం ఎప్పుడు నేర్చుకొన్నావు కృష్ణా అంటున్నాడు ధుర్యోధనుడు. ఆ గర్వం పనికిరాదు అని చెప్పటం కోసం ఈ మాటలు చెపుతున్నాను. మనలో కూడా అంత అహంకారం ఉన్నవారు, అంత గర్వం ఉన్నవారు ఉంటారు, అది మనం చూసుకోవాలి. అలా అహంకారం పెంచుకొంటే, గర్వం పెంచుకొంటే ధుర్యోధనుడికి పట్టిన గతే మనకు కూడా పడుతుంది. మనకు ఐశ్వర్యం ఉన్నా, అధికారం ఉన్నా గర్వం రాకుండా చూసుకోవాలి. ఈ లోకంలో ఉన్న ఎంజాయ్‌మెంట్సును అతిక్రమించటం చాలా కష్టం కాని ప్రయత్నం చేస్తే సఫలం అవుతాము. మీకు భౌతికంగా ఏవైనా అవకాశములు వచ్చినా వాటిని చూసి గర్వం తెచ్చుకోవద్దు, ఆ అవకాశములను ఉపయోగించుకొని మోక్షం పొందటానికి ప్రయత్నం చేయండి. మీకు ఎన్ని అవకాశములు ఉన్నా, ఎన్ని భోగాలు ఉన్నా ఆత్మజ్ఞానం లేకపోతే దుఃఖంలోనుండి, అశాంతిలోనుండి ఆ జీవుడు విడుదల పొందలేడు అని ఉపనిషత్‌లలో ఉంది. సుఖం అంటే ఏమిటి? ఒక వస్తువుతో గాని, ఒక వ్యక్తితోగాని, ఒక పదార్థంతోగాని, లోకంతోగాని, చావు పుట్టుకలతోగాని సంబంధం లేకుండా తను స్వతంత్రంగా ఉన్నప్పడు ఏ సుఖాన్ని అయితే అనుభవిస్తున్నాడో అది నిజమైన సుఖం. బాహ్యమైన వస్తువులనుండిగాని, బాహ్యమైన సంఘటనల నుండిగాని, బాహ్యమైన వ్యక్తులనుండిగాని మనం ఏదైనా సంతోషం తీసుకొంటాము అనుకోండి, అది తాత్కాలికంగా బాగా ఉన్నా ఆ సంతోషం భవిష్యత్‌లో దుఃఖంగా మారిపోతుంది. అంటే వస్తువుల మీదగాని, వ్యక్తులమీదగాని, లోకంమీదగాని మన హేపీనెస్ ఆధారపడి ఉండకూడదు, అలా ఉంటే అది ఏదోరోజు భంగం అవుతుంది. ప్రతీమనిషి ఈ శరీరం నాది, ఈ పేరు నాది అనుకొంటూ ఆ శరీరంతోటి, పేరుతోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటాడు, అవే వాడిని బంధిస్తాయి. ఈ రెండింటిని మనం అతిక్రమించ లేకపోతున్నాము. ఇలా మనకు రూపబుద్ధి ఉన్నంతకాలం, నామబుద్ధి ఉన్నంతకాలం మనం శవాలను మోస్తూ ఉండవలసిందే. ఉపనిషత్‌లలో ఏమని చెప్పారు అంటే నది వెళ్ళి సముద్రంలో ఎలా ఐక్యమవుతుందో అలాగ నీవు రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి విడుదల పొందినప్పడు నువ్వు నీ హృదయంలో ఉన్న నిజమైన ఆత్మలో, నారాయణుడిలో ఐక్యమవుతావు. మనం శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి కాని యల్లయ్యమాటలు, పుల్లయ్యమాటలు భుజాన వేసుకొని తిరగకూడదు. భగవంతుడు చెప్పిన మాటను మనం

గౌరవిస్తూ ఉంటే, దాని మీద ఇష్టం పెంచుకొంటూ ఉంటే, ఆయన చెప్పినట్లుగా మనం జీవిస్తూ ఉంటే ఆయన స్వరూపం మనకు ఎరుకలోనికి వస్తుంది. భగవంతుడి నామాన్ని మనం స్మరిస్తూ ఉంటే మనకు అక్కరలేని తలంపులు ఆగిపోతాయి. నీకు అక్కరలేని తలంపులు, చెడు తలంపులు వస్తున్నాయి అనుకో అవి నీ మనస్సును అపవిత్రం చేస్తాయి. ఒక్క ఎండ్రిన్ చుక్క లోపలకు వెళ్ళింది అనుకో, అది నిన్ను చంపకపోయినా లోపల మొత్తం డైజెస్టివ్ సిస్టమ్‌ను పాడుచేస్తుంది. అలాగే మనకు ఏదైనా ఒక చెడు తలంపు వచ్చింది అనుకో అది మన మనస్సును ఎంతోకొంత పాడుచేస్తుంది. ప్రతీవాడు ఏదో రకంగా సంపాదించుకోవాలి అనుకొంటున్నాడు కాని ఆ సంపాదనలో ధర్మం ఉందా అని ఎవడు చూసుకోవటంలేదు. అంటే ఎయిర్ పొల్యూషన్ ఎలా ఉందో, వాటర్ పొల్యూషన్ ఎలా ఉందో కలియుగంలో మానవుడి సంపాదనలో కూడా అంత పొల్యూషన్ ఉంటుంది అని వ్యాసుడు చెప్పాడు అంటే ఎంతదూరం ఆలోచించి చెప్పాడో చూడండి. మన దగ్గర డబ్బు ఉంది, డబ్బు ఉంది అని అనుకొంటున్నాము. ఆ డబ్బు మనకు ఎలా వచ్చింది, ఎంతో మందికి అపకారం చేస్తే ఆ డబ్బు వచ్చిందా లేక న్యాయంగానే సంపాదించుకొన్నామా అనేది చూసుకోండి. నీ దగ్గర ఉన్న వెల్త్‌లో పొల్యూషన్ ఉందో లేదో చూసుకో. ఇప్పుడు నీవు అనుభవించేది కూడా భగవంతుడి ప్రసాదం అని అనుభవించాలి అంతేగాని నీ సొంతం అని అనుకోవద్దు. అది నీకోటాకు ఆయన కేటాయించాడు అంతేగాని అది నీది కాదు, అంతా ఆయనదే. మీకు, నాకు, పంచభూతాలకు, మొత్తం సృష్టికంతకూ ఆయనే యజమాని. మీరందరు మమ్మల్ని గౌరవిస్తారు అనుకోండి, మాలో విశేషం ఏమీ లేదు. భగవంతుడిని మేము స్మరించుకొంటూ ఉంటే ఆ భగవంతుడి రూపాన్ని మీరు ఎలా గౌరవిస్తారో మమ్మల్ని కూడా అలా గౌరవిస్తారు. భగవంతుడిని స్మరించగా స్మరించగా ఆయన సారూప్యం పొందుతాము, ఆయన సమీపంలోనికి వెళ్ళిపోతాము. భగవంతుడు తన శరీరం కంటే భక్తుల శరీరాలను బాగా చూసుకొంటాడు. మనకు ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి సంతోషం వస్తుంది. సమానబుద్ధిని మనం జాగ్రత్తగా కాపాడుకొంటున్నాము అనుకోండి. భగవంతుడు ఆయన దయను చూపించి, ఆయన ఔన్నత్యాన్ని మనకు తెలియపరచి అక్కడ మన మనస్సు నిలబడేటట్లు చేసి, ఆయనను ప్రేమించేటట్లు ఆయనే చేసుకొని ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదే మోక్షం. చాలా తేలికయిన మార్గాన్ని విడిచిపెట్టేసి మీరు

కష్టమయిన మార్గాలు పట్టుకొంటున్నారేమో అంటున్నాడు పరమాత్మ. నా నామాన్ని స్మరించుకోవటం వలన, నా రూపాన్ని ధ్యానించటం వలన, నేను చెప్పిన మాటలు తలపెట్టు కోవటం వలన, నాయందు ప్రేమకలిగి ఉండటం వలన మీరు తరిస్తారు. నాయందు ప్రేమ కలిగి ఉంటే మీకు ఏకాగ్రత కలుగజేసే బాధ్యత, మీకు పుణ్యం సంపాదించిపెట్టే బాధ్యత నాది అంటున్నాడు. మనం కర్తృత్వం లేకుండా కర్మచేస్తే వాడిని పుణ్యం అంటుకోదు, పాపం అంటుకోదు, అదే వాడికి కడసారిజన్మ అంటే వాడు పరమాత్మలో ఐక్యమవుతాడు. మనం చేస్తే ఇష్టంతో చేస్తాము, లేకపోతే అయిష్టంతో చేస్తాము అందుచేత మనలను కర్మ వాసనలు చుట్టుకొంటాయి, ఈ కర్మ వాసనలే మనకు రాబోయే జన్మలకు బీజాలు అవుతాయి. మనకు అందరకు కూడా ఇంట్లో వారు అంటే ఇష్టం ఉండదు, సమాజం అంటే ఇష్టం ఉండదు, దేవుడు అంటే ఇష్టం ఉండదు, అందరికీ ఎవరి శవం అంటే వారికి బాగా ఇష్టం, ఎవరి అహంకారం అంటే వారికి బాగా ఇష్టం. నేను చెప్పిన మాటలు అసత్యాలు అనుకొంటే మీరు ఇంటికి వెళ్ళి చూసుకోండి. మనకు అందరికంటే కూడా మన శరీరం అంటే, మన మనస్సు అంటే మనకు చాలా ఇష్టం. మనం ఎక్కడికి వెళ్ళినా ఈ రెండూ సిద్ధమవుతాయి. శరీరం చనిపోయిన తరువాత ఇంక అది మన కూడా రాదు కాని మనస్సు మాత్రం శరీరం చనిపోయిన తరువాత కూడా మన వెంట వచ్చేస్తుంది. ఈ రెండింటికోసమే మనం చెడ్డ పనులు చేస్తాము, శాస్త్రాన్ని వదిలేస్తాము. మనస్సులో ఉన్న కోరికలను సంతృప్తి పరచుకోవటానికి, శరీరాన్ని సుఖపెట్టటానికి వీటికోసమే మనం జీవిస్తూ ఉంటాము, పరమాత్మ చెప్పిన మాటలను మనం పట్టించుకోము. అందుచేత ఇవి రెండూ మనలను బంధిస్తున్నాయి. ఈ రెండింటిని ఒక ప్రక్కనపెట్టి శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించేవాడికి మోక్షం వస్తుంది. ఆత్మవిద్యను ఎందుకు నేర్చుకోమన్నాడు అంటే ఆత్మవిద్యను నీవు శ్రవణం చేయగా, శ్రవణం చేయగా దాని మీద నీకు రుచి కలుగు తుంది, అప్పుడు దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తావు, అర్థం చేసుకొన్నాక ఆచరిస్తావు. ఆచరించగా ఆచరించగా లోపల ఉన్న వస్తువును ఎప్పుడు అనుభవంలోనికి తీసుకొని రావాలో పరమాత్మ ముహూర్తం పెట్టుకొని అనుభవైకవేద్యం చేస్తాడు, మనం అనుభవాల కోసం ఎదురుచూడనక్కరలేదు. మన శరీరం వెయ్యి సంవత్సరాలు ఇక్కడ ఉండదు, అది ఉన్నంతకాలం భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవిస్తూ ఉంటే తరువాత అంతా ఆయనే చూసుకొంటాడు. భగవంతుడి

మీద మనకు నిజంగా ప్రేమ కుదిరితే మనకు మోక్షం వచ్చేస్తుంది. అయితే ఈశ్వరుడి పట్ల ప్రేమకలగటానికి మనకు పూర్వజన్మ పుణ్యబలం ఉండాలి. పూర్వజన్మలలో మనం ఎంతో కొంత సత్కర్మ చేయకపోతే ఇప్పడు మనం ప్రయత్నం చేసినా మన మొఖం ఈశ్వరుని వైపుకు తిరగదు. మీరు నామాన్ని స్మరించుకోమంటున్నారు కాని నామాన్ని స్మరించుకోవాలనే బుద్ధి నాకు రావటంలేదు అని ఒకరు అడుగుతున్నారు. ఆ బుద్ధి ఎందుకు రావటంలేదు అని అడిగాను. పూర్వజన్మలో పాపాలు చేసి ఉంటాను అందుచేత భగవంతుడి నామాన్ని స్మరించుకోవాలనే బుద్ధి కలగటం లేదు అన్నారు. పూర్వజన్మలో పాపాలు చేసాను అంటున్నావు కదా, అది మర్చిపో. అది మర్చిపోవటానికి ప్రయత్నం చెయ్యి నీకు నామం చేసుకొనేబుద్ధి కలుగుతుంది అని చెప్పాను, మర్చిపోవటమే మందు. మీకు ఎప్పడైనా సంతోషం వస్తూ ఉంటుంది. సంతోషం వేరు, సుఖం వేరు. ఇది బాగా అర్థం చేసుకోండి. ఉన్నవస్తువుతో మీరు తాదాత్మ్యం పొందినప్పడు వచ్చేది సుఖం, బయట వ్యక్తులద్వారా వస్తువుల ద్వారా వచ్చే దానిని సుఖం అనరు, అది సంతోషం, అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది. బయట వ్యక్తులతోగాని, లోకంతోగాని సంబంధం లేకుండా వచ్చే సుఖమే నిజమైనసుఖం, అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు దేహం చనిపోయిన తరువాత కూడా ఆ సుఖం అలా కంటిన్యూ అయిపోతుంది. పాండవులకు విజయం చేకూర్చాలి అని కృష్ణుడు అనుకొన్నాడు, ఒకసారి ఆయన అనుకొన్నాక అది ఎలా చేకూర్చాలో అంతా ఆయనే చూసుకొంటాడు, ఇంక మనకు సంబంధం లేదు. అలాగే మనకు మోక్షం ఇవ్వాలి అని భగవంతుడు అనుకొన్నాడు అనుకోండి అది ఎప్పడు ఇవ్వాలి, దానికి అనుగుణంగా మన బుద్ధిని ఎలా తిప్పాలి అది అంతా ఆయనే చూసుకొంటాడు, అసలు ఆయన అనుకోవాలి అంతే. శాస్త్రంలో ఏమని ఉంది అంటే నాకు మోక్షం కావాలి, నాకు మోక్షం కావాలి అనుకొనే వాడికి మోక్షం రాదు, ఏ జీవుడిని ఆయన ఎన్నుకొన్నాడో వాడికే ఆయన ఎరుకలోనికి వస్తాడు. కొంతమంది అన్నీ మాకే తెలుసు అనుకొంటారు, అన్నీ వారికే తెలిసినప్పడు వారి గొడవ మనకెందుకు అనుకొంటాడు. కవచకుండలాలు ఉండగా అర్జునుడు కూడా కర్ణుడిని జయించ లేడు. కర్ణుడికి ఎవరు ఏది అడిగితే అది ఇచ్చే అలవాటు ఉంది కాబట్టి ఇంద్రుడిని పంపించి కవచకుండలాలు అడిగించి కృష్ణుడు గ్రౌండ్ అంతా ప్రిపేర్ చేస్తాడు. వాడే మాయావి. ఈ పనులు అన్నీ ఎందుకు చేస్తున్నాడు అని మీరు అనుకోవచ్చు. పాండవులకు

జయం కలగాలి అనుకొన్నాడు కాబట్టి అంతా ప్రిపేర్ చేస్తున్నాడు. అలాగే మనకు మోక్షం ఇవ్వాలి అని భగవంతుడు అనుకొన్నప్పడు ఆయనే లైన్ క్లియర్ చేసుకొంటూ వెళతాడు, వాడే పరమాత్మ. అయితే ఈశ్వరుడు ఉన్నాడా, లేడా అనే సందేహం పెట్టుకోవద్దు. ఈశ్వరుడిని మనం పూజించేటప్పడు, ఆయనను జపించేటప్పడు ఆయన అంతర్యామి, అన్ని శక్తులు ఉన్నవాడు, ఆయన సర్వజ్ఞుడు, మనలను అనుగ్రహించేవాడు ఆయనే అని ఆయన ఔన్నత్యాన్ని గుర్తించి మనం ఆయనను పూజించాలి. ఆయన ఔన్నత్యం తెలియకుండా ఆయన మనకు ఎలా ఎరుకలోనికి వస్తాడు. మనం మంచికర్మలు చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా ఇవి అన్నీ మన బుద్ధి శుద్ధి అవ్వటంకోసమే. భగవంతుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నా ఆయన మనకు గోచరమయితే కాని మనం పునర్జన్మలోనుండి విడుదల పొందలేము. మన బుద్ధి శుద్ధిఅయితేకాని ఆయన మనకు గోచరం కాడు. దానికి మనం లోపల వివేకం పెంచుకోవాలి, మంచితనం పెంచుకోవాలి, లోపల అంతస్థు పెంచుకోవాలి. ఎవరైనా చెడు మాటలు చెపుతున్నారు అనుకోండి, ఆ మాటలు ఎందుకు చెపుతున్నారో మనం అర్థం చేసుకోవాలి కాని అవి భుజానవేసుకొని తిరగకూడదు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీవు ఏదైనా మాట్లాడితే ఆ మాట నీకు ఉపయోగపడాలి, అది వినేవాడికి ఉపయోగపడాలి. అంతేగాని ఒక ఉద్దేశం లేకుండా, కావాలి అని ఉపయోగంలేని మాటలు నువ్వు ఎందుకు మాట్లాడుతున్నావు, అలా ఎందుకు నీ ప్రాణశక్తిని పాడుచేసుకొంటావు అంటున్నారు. రావణుడి దగ్గర చాలా ఐశ్వర్యం ఉంది. ఇంత ఐశ్వర్యం పెట్టుకొని ఈ పాడుబుద్ధిఏమిటి వీడికి, వాడు ఒక్కడే పాడైపోయిన ఫరవాలేదు ఈ లంకలో ఉన్న జనాన్ని అంతా పాడుచేస్తున్నాడు అని ఆంజనేయస్వామి బాధపడ్డాడు, అంత ఐశ్వర్యం ఉంది. రావణాసురుడి యొక్క సంహారం అయిపోయిన తరువాత ఈ లంకారాజ్యం ఎవరో ఒకరికి ఇవ్వాలి కదా అందుచేత ఆ రాజ్యాన్ని విభీషణుడికి ఇచ్చేద్దాము, లంకా రాజ్యము వాళ్లదే కదా వారికే ఇచ్చేద్దాము అని రాముడు చెపుతాడు. ఈ రాజ్యం మాకు అక్కరలేదు ఈ రాజ్యం నీకే ఇచ్చేస్తాము అని విభీషణుడితో చెపుతూ రాముడు ఒక మాట చెపుతాడు. శివుడేమో రావణాసురుడికి ఇచ్చాడు ఈ ఐశ్వర్యం, రావణాసురుడిది నీకు ఇస్తున్నాను, నాదంటూ ఏమీ నీకు ఇవ్వటం లేదు అని విభీషణుడితో రాముడు అంటాడు. ఈ వాక్యానికి నాకు ఆశ్చర్యం కలిగింది. రాముడి యొక్క గొప్పతనం, ఆయనలోని మంచితనం ఎంజాయ్‌చేస్తారని చెపుతున్నాను. అందుచేత రాముడిని మర్యాద

పురుషోత్తముడు అన్నారు. ఇప్పడు మనం ఏమి చేస్తున్నాము అంటే ఎవరో చేసిన మంచి పనులు కూడా మేమే చేసాము అని చెప్పకొంటాము, ఇదీ కలియుగం. భగవంతుడి యొక్క గొప్పతనం శ్రవణం చేయకుండా, భగవంతుడి యొక్క ఔన్నత్యం మనకు తెలియకుండా ఆయన మీద మనకు ప్రేమ కలుగదు, ఇష్టం కలుగదు. ఆయన మీద ఇష్టం కలగటానికి ఆయన గురించి మనం శ్రవణం చేయాలి, ఆయన చెప్పిన మాటలు మననం చేయాలి. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానంలో నుండి బయటకు రావాలి. మనం ఎవరో ఒకరిని తిడుతూ ఉంటాము అనుకోండి, మన తిట్లు వాడు సహనంగా భరిస్తున్నాడు అనుకోండి. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే వారికి ఎంత సహనం ఉంది అనుకొని మనం పూర్వజన్మలో సంపాదించిన పుణ్యం ఏదైనా ఉంటే వారికి ఇచ్చేస్తాడు. అన్నవాడు పిశాచంగా ఉంటాడు, పడ్డవాడు దేవుడు అయిపోతాడు. అంటే భగవంతుడు వాడి సహనానికి మెచ్చుకొని ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఇంకొకమాట మీకు చెపుతున్నాను. ఇప్పడు ఇది మీకు అర్థమవ్వటం కష్టం, కాని వినటం మటుకు వినండి, ఇంకో పది సంవత్సరాల తరువాత మీకు అర్థమయినా ఫరవాలేదు. మీరు భక్తిని పెంచుకోవటం మానివేసి, సాధన చేసుకోవటం మానివేసి వాడు అటువంటివాడు, వీడు ఇటువంటివాడు అని ఎంతసేపు ఎవరో ఒకరిని తిడుతూ ఉంటారు అనుకోండి దీనికి భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే మీ బలహీనతలే బయటకు వస్తున్నాయి అని మీకు తెలియటం లేదు అన్నాడు. వారిలో ఆ బలహీనత ఉంది, వీరిలో ఈ బలహీనత ఉంది అని అంటూ వాడిని తిట్టి పడేసాము అని మనం అనుకొంటాము కాని నువ్వు తిట్లు పడే రోజులు దగ్గరకు వస్తున్నాయి అని నీకు తెలియటం లేదు అంటున్నాడు భగవంతుడు. మీరు ఇష్టమయిన వస్తువును తినేటప్పడు ఎంత ఆనందాన్ని అనుభవిస్తారో మీరు సాధన చేసేటప్పడు కూడా అంత ఆనందంగా ఉండాలి. అప్పడు భగవంతుని దయకు పాత్రులవుతారు. మీరు జపం చేస్తున్నా, ధ్యానం చేస్తున్నా సుఖంగా చేస్తున్నారా? చెయ్యటం లేదు, ఏదో లాంఛనం కోసం చేస్తున్నారు. కొంతమంది ఇంటి దగ్గర ధ్యానం చేసుకొంటారు, చిన్న చప్పడు అయింది అనుకోండి ఇంక వారిని పట్టుకొని తిట్టేస్తారు నీ మనస్సు పరమాత్మ మీద ఉంటే ఆ చప్పడు నీకు ఎందుకు వినబడుతుంది. అసలు యదార్థం చెప్పాలంటే ధ్యానం అనేది చేసేది కాదు, అది వచ్చేది. మనం అన్నం తింటాము, అన్నం తిన్నాక అది లోపల అరుగుతూ ఉంటుంది, అది మనకు తెలియదు. అలాగే నీవు చేసుకొనే జపం

కూడా నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా నీవు నుంచున్నా, కూర్చొన్నా, నడుస్తున్నా, ఏమి చేస్తున్నా లోపల సహజంగా జరిగిపోతూ ఉండాలి. అలా నామజపం సహజంగా జరుగుతూ ఉంటే అది అక్కరలేని తలంపులను దూరంగా నెట్టేసి, భగవంతుడి స్వరూపాన్ని మీకు పట్టి ఇస్తుంది. భగవంతుడి యొక్క నామాన్ని స్మరించగా స్మరించగా మనకు జ్ఞానం రావటానికి ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో ఆ ఆటంకాలను నామం తీసేస్తుంది, అందుచేత నామాన్ని శ్రద్ధగా, ప్రీతితో చేసుకోవాలి. ఆ నామమే మనలను చీకటిలోనుండి వెలుతురులోనికి, మృత్యువులో నుండి అమృతత్వంలోనికి తీసుకొని వస్తుంది. ఈ జీవుడు మనవాడు, వీడికి మన దయ చూపించాలి అని ఈశ్వరుడు ఒక్కసారి సంకల్పించాడు అనుకోండి, వాడికి మోక్షం వచ్చేసినట్లే. మనం ఆయనను ఎన్నుకోవటంకాదు, ఆయన మనలను ఎన్నుకోవాలి, ఆ యోగ్యత, అర్హత మనం సంపాదించుకోవాలి. భగవంతుడి పాదాలయందు భక్తిని విడిచిపెట్టవద్దు, ప్రాణం పోయేటప్పుడు కూడా నారాయణ స్మరణ విడిచిపెట్టకూడదు. ఈ సృష్టికి, మీకు, నాకు ఏదైతే ఆధారంగా ఉందో ఆ వస్తువే నారాయణుడు. ఆయన అనుగ్రహం వలన హృదయగ్రంథులు ఛేధింపబడతాయి. హృదయగ్రంథులను ఛేధించుకోవాలనే బుద్ధిని మనకు ఇచ్చేవాడు, ఛేధింపబడేటట్లు చేసేవాడు ఆయనే. ఇంక మనం ఎక్కడ ఉన్నాము అంటే మనం సున్నలం. మనం లేము ఉన్నది ఆయనే. భగవంతుడే ఈ లోకంగా, జీవకోటిగా ఉన్నాడు. అందుచేత జీవకోటికి మనం ఏమి సహాయసహకారములు అందించినా అది భగవంతుడికి నైవేద్యం పెట్టినట్లే. ఎందుచేతనంటే కనిపించనివాడు నీకు లోకంగా, జీవకోటిగా కనిపిస్తున్నాడు. అందుచేత కనిపించే దానిని ఆధారంగా చేసుకొని ఆ కనిపించని వాడిలో ప్రవేశించవయ్యా. మీరు ఏదైనా పని చేసేటప్పుడు అది మంచిపని అనుకొంటే చేసి వదిలేయండి, అలా కాకుండా మేము ఆ మంచిపని చేసాము, ఈ మంచిపని చేసాము అని రోజూ మీరు చేసిన పనులు తలపెట్టుకొంటూ ఉంటే మీకు పుణ్యం రావచ్చుకాని, మీ బుద్ధి శుభ్రంగా మసి అయిపోతుంది. అజ్ఞానం పెరిగిపోతుంది, ఆవరణదోషం పెరిగిపోతుంది, ఈ జీవుడు బందిఖానాలో పడతాడు. అందుచేత మీరు మంచిపని చేయాలంటే చేయండి, చేసి మర్చిపోండి. అంతేగాని దానిని మొయ్యొద్దు, దానిని మోస్తూ ఉంటే అది మిమ్మల్ని బంధిస్తుంది. గీతలో పరమాత్మ ఏమనిచెప్పాడు అంటే నన్ను స్మరించుకొంటూ నీపని చేసుకో అని చెప్పాడు. నీ చేతులను పనిచేసుకోనియ్యి. నువ్వు మనస్సులో మటుకు నన్ను

స్మరించుకొంటూ చేతులతో నీ పని ఏదో నీవు చేసుకో. అప్పుడు నీ మనస్సు శుద్ధి అవుతుంది, నీ పని అయిపోతూ ఉంటుంది. మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి, భగవంతుడు మీకు ఏవైనా అవకాశములు ఇస్తే సృష్టిరూపంలో ఉన్న భగవంతుడికి సహాయసహకారములు అందించండి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకోండి కాని ఆ అవకాశములను చూసి గర్వం పెంచుకోవద్దు, అహంకారం పెంచుకోవద్దు, ఆవరణదోషం పెంచుకోవద్దు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను మీరు అజ్ఞానంలో నుండి బయటకురావటానికి ఉపయోగించుకోవాలి కాని అజ్ఞానంలో కూరుకొనిపోవటానికి ఉపయోగించుకోకూడదు. మీకు ఇంటి దగ్గర అవకాశం కుదిరినప్పుడు కొంచెం ధ్యానం చేసుకోండి, రోజూ ఒక గంట సేపు ఏకాంతంగా కూర్చోండి, ఏకాంతవాసం మీకు తెలియకుండా ఏకాగ్రతను పెంచుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-10-05, చిలుకూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఇక్కడ ఎక్కువ మంది మతాన్ని మార్చుకొంటున్నారు అని చెపుతున్నారు. ఎవరూ మతాన్ని మార్చుకోవద్దు. అన్ని మతాలు సమానమే, అన్ని మతాలలో కూడా మంచినే చెప్పారు, జ్ఞానాన్నే చెప్పారు. అన్ని పురుషార్థాలలో ముఖ్యమైనది మోక్షం. మోక్షం పొందటానికి తగిన సామాగ్రి అన్ని మతాలలో ఉంది. ఎవరి మతం ద్వారా వారు బాగుపడవచ్చు. మీకు తరించాలనే తపన కనుక ఉంటే హిందూమతం చాలు. మీరు మోక్షం పొందటానికి తగిన సామాగ్రి హిందూమతంలో ఉంది. ఎవరూ ఇతర మతాలలోనికి వెళ్లవద్దు, అలా మతాలు మార్చుకోవలసిన అవసరం లేదు, అదీ నేను చెప్పేది. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఆ ఆకర్షణలకు గురి కాకుండా ఎలా జీవించాలి, మోక్షం ఎలా పొందాలి అని చెప్పేదే హిందూ మతం. ఇది ఎవరో ఒక వ్యక్తి చేత స్థాపించబడినది కాదు, ఇది ఒక సనాతన ధర్మం. పంచ భూతాలు ఎప్పటి నుండి అయితే ఉన్నాయో ఈ భూమి ఎప్పుడైతే పుట్టిందో అప్పటినుండి హిందూమతం ఉంది. ఈ మతంలో అనేకమంది అవతారపురుషులు, మహాత్ములు, యోగులు, ఋషులు వచ్చారు. వారిలో రాముడు, కృష్ణుడు ఒకరు. అంతేగాని రాముడి తోటి, కృష్ణుడితోటి ఈ మతం ప్రారంభం అవ్వలేదు. అంతకుముందు కొన్ని లక్షల సంవత్సరాల నుండి ఈ మతం ఉంది. మనం విషంతో కూడిన అన్నం తిని అది చాలా లేటుగా

గుర్తించాము అనుకోండి, అది శరీరం అంతా వ్యాపించటం, మనలను చంపేయటం కూడా జరుగుతుంది. బాహ్యమైన ఆకర్షణలు అంతే. ఏవో ఆకర్షణలకు లోబడి, ఏవో ఆశలు పెట్టారని మీరు కంగారుపడి మతాన్ని మార్చుకోవద్దు. మతాన్ని మార్చుకోవటం అంటే విషంతో కూడిన అన్నం తినటం, తిన్నప్పడు అది బాగానే ఉండవచ్చు, లోపలకు వెళ్ళిన తరువాత అది అరగటం ప్రారంభించాక అప్పడు మనం గుర్తించినా లాభం లేదు అంటే మనం గుర్తించే టప్పటికి మన ప్రాణం పోతుంది. అందుచేత ఎవరూ మతాలు మార్చుకోవద్దు. ఎవరి మతంలో వారు ఉంటూ, ఆ మతం ఎలా జీవించమని చెప్పిందో ఆ రకంగా జీవించటానికి ప్రయత్నం చెయ్యండి. ధర్మాన్ని విడిచిపెట్టవద్దు, మన పద్ధతిలో మనం ధర్మాన్ని ఆచరించాలి. ఈ సృష్టి అంతా భగవంతుడిదే. అందులో భగవంతుడు మనకు దేనినైతే కేటాయించాడో, ఆ కేటాయించిన దానితో మనం సంతృప్తిపడి, మన పని మనం శ్రద్ధగా, ధర్మంగా చేసుకోవాలి. మనం ఈ మతాన్ని కల్పించుకోలేదు, ఈ మతంలో జన్మించాము అందుచేత ఈ మతంలో మరణిస్తాము. మనం అభివృద్ధిలోనికి రావటానికి ఈ మతంలో ఉన్న సామాగ్రి సరిపోతుంది. అందుచేత మతాలు మార్చుకోవలసిన అవసరం లేదు, అదీ నేను చెప్పేది. మనం పూజ చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా వీటి అన్నింటి యొక్క ప్రయోజనం మన బుద్ధిని బాగుచేసుకోవాలి. ఇప్పడు నవరాత్రులు జరుగుతున్నాయి. ఇందులో మొదటి మూడు రోజులు దుర్గని, మధ్య మూడు రోజులు లక్ష్మీదేవిని, చివరి మూడు రోజులు సరస్వతీదేవిని పూజిస్తారు. దుర్గ అన్నా, లక్ష్మి అన్నా, సరస్వతి అన్నా యివన్నీ పరమాత్మకి పేర్లు. మొదటి మూడురోజులు మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉన్నాయేమో చూసుకొని వాటిని తొలగించు కొనే ప్రయత్నం చేయాలి. మధ్య మూడు రోజులు ఏమి చేయాలి అంటే మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించుకొన్న తరువాత మంచి గుణాలతో మన బుద్ధిని నింపుకోవాలి, చివరి మూడు రోజులు ఆత్మవిద్యను సంపాదించుకోవటానికి, జ్ఞానసంపదకు ప్రయత్నం చేయాలి, అవే నవరాత్రులు. ఇంకొకటి మీరు జ్ఞాపకం పెట్టుకోండి ఇతరులు ఎవరైనా మిమ్మల్ని పొగుడుతారు అనుకోండి, దానిని పట్టించుకోవద్దు, ఎవరయినా విమర్శిస్తారు అనుకోండి, దానిని పట్టించుకోవద్దు. ఆపొగడ్త నిజం కాదు, ఆ విమర్శ నిజం కాదు. ఆ రూపం, నామం నిజం కాదు. అవి నిజం అని మీరు అనుకోవటం వలన ఆ మాటలకు మీరు కంగారు పడతారు. రూపము, నామము, గుణము, కర్మ ఇవి అన్నీ మనం కల్పించుకొన్నవే, ఇవి అన్నీ

మనస్సు కల్పించిన గొడవలు. అసలు వస్తువు వీటి అన్నింటికి అతీతంగా ఉంది. మనందరం శారీరకఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇస్తున్నాము కాని మానసిక ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వటం లేదు. శరీరం ఎంత ఆరోగ్యంగా ఉండాలి అని మనం అనుకొంటున్నామో మన మనస్సు కూడా అంత ఆరోగ్యంగా ఉండాలి. స్మశానంతో మనకు, శరీరానికి ఉన్న సంబంధం తెగి పోతుంది కాని మనస్సు మన కూడా వస్తుంది. మన కూడా వచ్చే మనస్సు ఆరోగ్యం ఎలా ఉందో మనం పట్టించుకోవటం లేదు. జ్ఞానసముపార్జనకు మన బుద్ధిని సమాయత్తం చేయాలి. ఏ రూపము, నామము నిజం కాదు. అందుచేత బయట విషయాలను చూసి భయపడకండి. మీ మనస్సుకు లోచూపు కలుగుతూ ఉంటే, ఎక్కడయితే ఈశ్వరుడు ఉన్నాడో ఆ వైపుకు మీ మనస్సు మళ్ళుతూ ఉంటే ఏమిటి అనవసరంగా తెలియక భయపడ్డాము, ఈ భయానికి అర్థం లేదు అని మీ అంతట మీకు తెలుస్తుంది.

కొంతమంది ప్రతీ చిన్న విషయానికి భయపడతారు, అలా భయపడవద్దు, ఆ అలవాటు మంచిది కాదు. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోవాలి, లోపల అహంకారం పెట్టుకోకూడదు. ఇదంతా నా వల్లే అవుతోంది, నేనే చేస్తున్నాను అని అనుకోకూడదు, మన వల్ల ఏదీ కాదు, మనందరము భగవంతుడి చేతిలో పనిముట్లము. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, ఆహారశుద్ధి వలన మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. మనం చాలా జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలి. నోటికి ఏదైనా అంటుకొంది అనుకోండి మనం పుక్కిలించి ఊసేస్తాము. అలాగే మన నోటి నుండి ఏదైనా పొరపాటుమాట వచ్చింది అనుకోండి, ఆ దోషం పోవటానికి శివనామమో, కృష్ణనామమో చేసుకోవాలి. కొంతసేపు భగవంతుడు నామం చేస్తే ఆ దోషం పోతుంది. మనలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. మనం ఆయన మాటలను గుర్తించి, ఆయన పట్ల ప్రీతితో ఆయన అనుగ్రహం పొందటంకోసం మనం జీవిస్తూ ఉంటే మన శరీరం పోకుండానే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. భగవంతుడు మనకు స్వరూపంగా వ్యక్తమయ్యాక మన శరీరం యొక్క మరణం కూడా అసత్యం అని మనకు తెలుస్తుంది. సజ్జనసాంగత్యం వలన మనలో ఉన్న దుర్వాసనలు పోతాయి. మనం భగవంతుడిని శరణువేడుకొంటే ఆయన మనలోని బలహీనతలను తొలగించి, మనకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. భగవంతుడిని కాకుండా, సత్పురుషుడు కాని వాడిని మనం శరణు వేడుకొంటే వాడు మనలోని బలహీనతలను ప్రేరేపించి మనలను పాడుచేస్తాడు. మనకు రాగం పెరుగుతోంది అంటే

రజోగుణం పెరుగుతోంది అని అర్థం, మనకు బద్ధకం వస్తోంది అంటే తమోగుణం పెరుగుతోంది అని అర్థం, మన పని ఏదో మనం శ్రద్ధగా చేసుకొంటున్నాము అనుకోండి, జ్ఞానం సంపాదించాలనే తపన కలుగుతోంది అనుకోండి, అప్పడు సత్వగుణం బాగా ఉందని అర్థం. మీరు మంచిపనులు చేస్తే మంచిజన్మలు వస్తాయి, చెడ్డపనులు చేస్తే చెడ్డజన్మలు వస్తాయి. మంచికర్మ అయినా, చెడుకర్మ అయినా మనస్సు కల్పితమే, గుణం మనస్సు యొక్క కల్పితమే. నీ పేరు కూడా మనస్సు కల్పితమే. ఈ వలయంలోపడి, జన్మించటం మరణించటం ఈ చక్రంలో తిరుగుతూ భగవంతుడికి దూరమయిపోతున్నాము. ఇప్పడు మనం ఉన్నాము అనుకొంటున్నాము, భగవంతుడు లేడు అనుకొంటున్నాము. భగవంతుడికి శరణాగతి చేయటం వలన ఆయనే ఉన్నాడు, మనం లేము అన్న సంగతి అనుభవంలోనికి వస్తుంది. మనం శాంతచిత్తమును సంపాదించుకోవాలి. మనం ఏరకంగా జీవిస్తే భగవంతుడి ప్రీతికి పాత్రులవుతామో ఆ రకంగా మనం జీవించాలి. నీ లోపలే సుఖం ఉంది, శాంతి ఉంది. అది నీకు తెలియక విషయాల్లో సుఖం కోసం, శాంతి కోసం వెదుకు చున్నావు. లోపలఉన్న వస్తువును వదిలేసి, బయటవిషయాలలో ఏదో ఆనందం ఉంది అని వెతకటం గత జన్మలనుండి వచ్చే అలవాటు అంతే, అంతకన్న ఏమీలేదు. ఉన్నదంతా లోపలే ఉంది, బయట ఏమీ లేదు. నీకు వచ్చే సంకల్పం శుద్ధిగా ఉండాలి, నీ మనస్సు శుద్ధిగా ఉండాలి. చిత్తశుద్ధి లేకుండా, సంకల్పశుద్ధి లేకుండా నీకు సిద్ధి కలుగదు. ఆహారం శుద్ధిగా ఉంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే నీవు మోక్షంలో ప్రవేశించాలి. లోపల చైతన్యం ఎంత పవిత్రంగా ఉందో, ఎంత శుద్ధిగా ఉందో అంత పవిత్రత మనకు వచ్చింది అనుకోండి దాని స్వరూపం మనకు వచ్చేస్తుంది. అంతేగాని మన మనస్సు తోటి, మన బుద్ధితోటి పట్టుకొనేది కాదు, మన డబ్బుతో కొనుక్కొనేది కాదు. మీరందరు మంచివారే కాని మనకు ఎందుకు మోక్షం రావటంలేదు అంటే ఏదో గుడికి వెళతాము, లోకానికి సంబంధించిన కోరికలు అడిగి బుద్ధిని పాడుచేసుకొంటున్నాము. అసలు మనకు ఏది మంచిదో, ఎప్పడు ఏది మనకు ఇవ్వాలో మనకంటే భగవంతుడికి బాగాతెలుసు. మనకంటే భగవంతుడికి బాగాతెలుసు అన్న సంగతి మనకు తెలియక ఏదో ఒకటి అడిగేస్తున్నాము, ఇలా అడగటం వలన మన బుద్ధి కలుషితం అయిపోతోంది, ఇంక మనకు జ్ఞానం ఎలా వస్తుంది. అడగటం పొరపాటు అని కాదు ఇలా అడగటం వలన లోకానికి, దేహానికి బంధింపబడుతున్నాము. భగవంతుడి దగ్గరకు వెళ్లినప్పడు జ్ఞానాన్ని ప్రసాదించు, నీ

చేతిలో ఒక పనిముట్టుకింద ఈ దేహాన్ని ఉపయోగించుకో అని అడిగే శక్తి కూడా మనకు లేదు. అందుచేత మీరు పూజ చేసారు అనుకోండి, అభిషేకం చేసారు అనుకోండి, చేసుకోండి భగవంతుడిని ఏమీ అడగవద్దు, ఇదంతా నీ ప్రీతికోసమే చేస్తున్నాము అనుకోండి. రాముడు అరణ్యవాసానికి వెళ్లినప్పడు భరతుడు అక్కడ లేడు, మేనమామల ఇంటికి వెళతాడు. అక్కడ నుండి వచ్చిన తరువాత భరతుడితో కైకేయి ఏమని చెబుతుంది అంటే రాముడిని అరణ్యవాసానికి పంపేసాము, నీవు రాజ్యపాలన చేసుకోవచ్చు అని చెపితే భరతుడు ఏమన్నాడు అంటే నువ్వు చేసిన పని ఎలా ఉంది అంటే చేపలను రక్షిందామని చెరువులో ఉన్న నీటిని బయటకు తీసేసినట్లుగా ఉంది. చెరువులో ఉన్న నీరు అంతా తీసేస్తే చేపలు అన్నీ చచ్చిపోతాయి, నీవు చేసిన పని అలా ఉందమ్మా అని చెప్పాడు. ఈప్రాణకోటికి ఎవడైతే ఆధారమో వాడిని తరిమేసావు, ఇక్కడ నీవు సుఖపడు, రాజ్యపాలన చేసుకో అంటే దాని అర్థం ఏమిటి? రాముడు నీరు, మేము చేపల వంటివాళ్లము. నీరు లేకుండా చేప ఎలా ఉంటుంది? రాముడు లేకుండా భరతుడు ఎలా ఉండగలడు అన్నాడు.

భగవాన్ ఏమి చెప్పారు అంటే మనకు అనేక తలంపులు వస్తున్నాయి. వీటిలో తొలి తలంపు ఒకటి ఉంది, దేహము నేను అనే తలంపే తొలి తలంపు. ఆ తొలి తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తాయి. ఆ తొలి తలంపును విచారణచేసి, దానిని తొలగించుకోగలిగితే దుఃఖం యొక్క స్పర్శేనీకు ఉండదు. నీకు దుఃఖకారణం బయట లేదు, నీలోపలే ఉంది. నేను ఎక్కువ వాడినని, నేను తక్కువ వాడినని, నేను ధనవంతుడిని, నేను పేదవాడిని అని నీకు నువ్వే పరిమితులు కల్పించుకొంటు, ఆటంకాలు అన్నీ నువ్వే కల్పించుకొంటున్నావు. మరల వాటిలోనుండి బయటపడాలని ప్రయత్నం చేస్తున్నావు. నువ్వు కల్పించుకొన్న విషయాలే నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తున్నాయి. నీకు రాగం వలన దుఃఖం వస్తోంది, కోపం వలన భయం వలన దుఃఖం వస్తోంది. అందువలన నీకు ఏ కారణాల వలన దుఃఖం వస్తోందో వాటిని విడిచిపెట్టు. మనకు కోపం ఎక్కువయ్యే కొలది, భయం ఎక్కువయ్యే కొలది సుఖానికి, శాంతికి దూరమయిపోతాము. మీకు ఎవరినయినా చూసి భయం వేస్తోంది అనుకోండి అసలు ఆ వ్యక్తే నిజంకాదు, ఇంక మీకు భయం ఏమిటి? ఇది మీరు అర్థం చేసుకోవాలి. ఇతరుల పట్ల కూడా మన డ్యూటీ మనం చేయాలి. అక్కడ అహంకారం, మమకారం పెట్టుకోకూడదు. అహంకారం లేకుండా, మమకారం లేకుండా మన డ్యూటీ మనం చేయటం

నేర్చుకోవాలి, అలా చేస్తే మనం చేసే పని మనకు దుఃఖకారణం కాదు. మనం భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటే, ఆయనను స్మరిస్తూ ఉంటే ఆయనను తెలుసుకొనే ఉపాయం మన బుద్ధికి ఆయనే స్ఫురింపచేస్తాడు, ఈ రహస్యం తెలియక మనం బజారులో పడి తిరుగుతున్నాము. భగవంతుడిని భగవంతుడి ద్వారానే తెలుసుకోవాలి, అన్యంగా తెలుసుకోలేము, ఆ క్లూ మనకు అర్థమవ్వాలి, ఆ నిశ్చయబుద్ధి మనకు రావాలి. ప్రతీ శరీరం ఒంటరిగానే పుడుతుంది, ఒంటరి గానే వెళుతుంది. మీ ఇంట్లో ఎవరైనా ఒక పెద్దమనిషి ఉన్నాడు అనుకోండి, వాడు మీకు వెయ్యి ఎకరాలు సంపాదించి ఇచ్చాడు అనుకోండి, వాడు వెళ్ళేటప్పడు మీ ఇంట్లోని వారు ఎవరూ వెళ్ళరు. వాడు వెయ్యి ఎకరాలు సంపాదించినప్పడు వాడు చేసిన ఘోరాలు అన్నీ మటుకు వాడికూడా వెళతాయి. ఇంట్లోనివారు వెళ్ళరు వారు శుభ్రంగా తింటారు. వాల్మీకి అక్కడనుండే ఋషి అయ్యాడు. వాల్మీకి దారులు కాసి దొంగతనాలు చేసేవాడు. ఒకసారి వాడికి ఋషులు ఎదురయ్యారు. వారిని హింసిస్తూ ఉంటే ఏమయ్యా మా దగ్గర ఉన్న వస్తువులు అన్నీ ఇచ్చేసాము, నువ్వు ఇంతమందిని హింసపెడుతున్నావు, నువ్వు ఇవన్నీ ఇంట్లో వారికోసం చేస్తున్నావు. నువ్వు చేసే ఈ పాపపుపనులలో ఇంట్లోవారు ఎవరైనా భాగం పంచుకొంటారేమో ఇంటికి వెళ్ళి అడిగిరా అన్నారు. ఇంట్లోవారు ఏమన్నారు అంటే పోషించవలసిన బాధ్యత నీకు ఉంది, నీవు ఏమి చేస్తున్నావో, పాపలు చేస్తున్నావో మాకెందుకు? నీవు తెస్తే వండి కొంచెం నీకు పెడతాము, మేము తింటాము కాని నీ పాపాలు మటకు మేము పంచుకోము అని వారు చెప్పారు. అప్పడు వాడికి బుద్ధి వచ్చింది. ఒకడు జ్ఞాని అయ్యాడు అనుకోండి, వాడికి కర్తృత్వం పోతుంది, అహంకారం పోతుంది, ప్రారబ్ధం, సంచితం, ఆగామి నశిస్తాయి. అయితే వాడు ఆత్మజ్ఞాని అవ్వకముందు అతనికి ఏమైనా ఆస్తిపాస్తులు ఉంటే, అతనికి పుణ్యం ఉంటే, పాపం ఉంటే అది ఎవరు పంచుకొంటారు అనే చర్చ వచ్చింది. దీనికి శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే జ్ఞాని అవ్వకముందు వాడికి ఉన్న ఆస్థిపాస్తులను వాడి వారసులు పంచుకొంటారు, పాపం ఉంటే వాడి విరోధులకు పంచి పెడతారు, పుణ్యం ఉంటే వాడి స్నేహితులకు పంచిపెడతారు. అందరూ తలోఒకటి పంచు కొంటారు. జ్ఞానికి ఏమీ అక్కరలేదు. దేహబుద్ధి ఎవడికయితే నశించిందో వాడు జీవన్ముక్తుడు అవుతాడు. అక్కడ ఉన్నది చైతన్యమే, చైతన్యానికి ఇతరులు లేరు. దేవుడికి అసలు ద్వితీయమే లేదు, రెండవది అంటూ ఎలా ఉంటుందో తెలియనవాడు దేవుడు.

మనకు జ్ఞానం రాకపోవటానికి ఈ సృష్టి మీద మనకు ఉన్న మోహం, భోగలాలసం కారణం. మన భోగాలకు అనుకూలమైన విషయాలే మనం భగవంతుడిని అడుగుతాము. ఆయన ఇస్తే ఇవ్వవచ్చు కాని అవిఅన్నీ కాలప్రవాహములో కొట్టుకొని పోతాయి, దానికీ జ్ఞానానికి సంబంధం లేదు. ఏది అడగాలో మనకు తెలియక, కాలప్రవాహంలో కొట్టుకొనిపోయేవాటిని భగవంతుడిని అడుగుతాము. ఇలా ప్రాపంచిక విషయాలు అడిగి మన బుద్ధి కలుషితం అయిపోవటం వలన మనకు భగవదనుభవం పొందాలి అనే తపన లోపలనుండి రావటం లేదు. ఈ ప్రపంచంలోనికి మనందరం వచ్చాము సుఖపడటానికి వచ్చామా, దుఃఖపడటానికి వచ్చామా అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఈ ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, అది ఎలా ఉండాలో అలాగ ఉంది. ఈ ప్రపంచంలో నీవు లేనిపోని గొడవలు కల్పించు కొంటున్నావు. దానినిబట్టి నీకు దుఃఖం వస్తోంది కాని నిన్ను దుఃఖపడమని ఈ ప్రపంచం చెప్పటం లేదు. నీవు కల్పించుకొన్న గొడవల వలననే నీకు దుఃఖం వస్తోంది. మీరు శాంతిగా, సుఖంగా ఉన్నారు అనుకోండి ప్రపంచం అంతా సుఖంగా ఉందనిపిస్తుంది. మీరు అశాంతిగా, దుఃఖంగా ఉంటే లోకం అంతా దుఃఖంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అందుచేత బయట ఏమీ లేదు. నీవు ఎలాగ ఉన్నావో ప్రపంచం అలాగే నీకు కనిపిస్తుంది. ఈ ప్రపంచం ఒక అద్దంలాంటిది అన్నారు భగవాన్. నీ మొఖంలో ఏమి ఉందో అద్దం చూపిస్తుంది. ఏదైనా మసి ఉంటే నీవే తొలగించుకోవాలి అలాగే నీలోని బలహీనతలను ఈ ప్రపంచం చూపిస్తుంది. నీవు సాధన చేసి ఆ బలహీనతలను పోగొట్టుకోవాలి.

ఈ లోకంలో కొంతమంది సుఖంగా ఉండవచ్చు, కొంతమంది దుఃఖంగా ఉండవచ్చు మన కళ్ళకు అలాగ కనిపించవచ్చు, వారిని సుఖపెట్టాలని, వీరిని దుఃఖపెట్టాలని దేవుడు అనుకోవటం లేదు, ఆయనకు పక్షపాతం లేదు. ఎవడి సంస్కారాన్ని బట్టి వాడు ప్రవర్తిస్తున్నాడు. ట్యూబులైటు దగ్గర కొంతమంది గీత చదువుకొంటారు, కొంతమంది పేకాట ఆడుకొంటారు. వారిని గీత చదువుకోమని, వీరిని పేకాట ఆడుకోమని ఆ లైటు చెప్పటంలేదు, ఇద్దరికి వెలుతురును ఇస్తుంది. భగవంతుడు కూడా అంతే. భగవంతుడికి ఒకరిమీద ఇష్టం, ఒకరి మీద అయిష్టం లేదు. వారి సంస్కారాన్ని బట్టి కొంతమంది సుఖపడుతున్నారు, కొంతమంది దుఃఖపడుతున్నారు. మనం ఇంటి దగ్గర, బయట కూడా తక్కువగా మాట్లాడటం మంచిది, తక్కువ మాట్లాడటం వలన మాయ తగ్గిపోతుంది. మనం అవసరమయినప్పుడు మాట్లాడాలి,

అవసరం లేనప్పుడు మాట్లాడకూడదు, కల్పించుకొని మాట్లాడకూడదు. ఏదైనా కల్పించుకొని మాట్లాడుతున్నాము అనుకోండి మాయ పెరిగిపోతూ ఉంటుంది. ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది, అదే మాయ. పనులు అన్నీ ప్రేరేపించేది భగవంతుడే కదా మరి మేమేం చేస్తాం అండి అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. దుఃఖంగా ఉన్నప్పుడు భగవంతుడు ఇలా చేసాడు అని మీరు అంటున్నారు. మీరు సుఖంగా ఉన్నప్పడు భగవంతుడు మీకు ఎందుకు గుర్తుకు రావటంలేదు అంతా ఆయనే చేస్తూ ఉంటే. సుఖంగా ఉంటే మీ తెలివి అనుకొంటున్నారు, దుఃఖంగా ఉంటే భగవంతుడు చేసాడు అంటున్నారు, మనది ఎంత పాడుబుద్ధో చూడండి, ఈ పాడుబుద్ధిని సంస్కరింపచేసుకోవటానికి సాధన చేయాలి. అందుకే పూజలు, జపాలు, ధ్యానాలు, సజ్జనసాంగత్యం ఇవి అన్నీ కూడా. భగవంతుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అనేటువంటి విశ్వాసం కనుక మీకు ఉంటే అసలు దుఃఖమే రాదు. మీకు వచ్చే దుఃఖం భగవంతుడికి తెలియకుండా రావటంలేదు, అది మన మనస్సును కడిగేయ టానికే వచ్చి ఉంటుంది, మనమేలు కోసమే ఆదుఃఖాన్ని పంపాడు అని మీకు తెలుస్తోంది అనుకోండి ఆ దుఃఖం కూడా మిమ్మల్ని అంటదు. కారణం లేకుండా ఒకోసారి మనస్సులో ఏదో అనారోగ్యం వస్తూ ఉంటుంది, దానికి బయట కారణం కనబడదు. ఈశ్వరుడు అలా ఎందుకు చేస్తున్నాడు అంటే మన చైతన్యస్థాయిని పెంచటానికి అలా చేస్తూఉంటాడు. అలాగ భగవంతుడు లోపల ఉండి పని చేయడు అనుకోండి, మన చైతన్యస్థాయి పెంచటానికి తగిన అశాంతిని పంపడు అనుకోండి అప్పుడు ఆస్థాయిలోనే ఉండిపోతాము. ఈ స్థాయిలో నుండి పైకి పంపటానికి ఒకోసారి భగవంతుడు అకారణమైన అశాంతిని పంపిస్తూ ఉంటాడు. అది మీ మంచికోసమే పంపిస్తున్నాడు అని మీరు అర్థం చేసుకొంటే మీరు ధన్యులు. ఒకోసారి భగవంతుడు మీకు ఇష్టమైన వారిచేత మాటలు అనిపించవచ్చు. ఎందుకు అంటే వారి మీద ఉన్న మమకారం పోవటంకోసం భగవంతుడు ఆడే ఆట అది. అదీ మీకోసమే చేస్తున్నాడు. భగవంతుడు ఏది చేసినా మన మంచి కోసమే చేస్తున్నాడు అనే భావన ఉన్నవాడికి దుఃఖం ఏమిటి? నాకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది ఇది ఎప్పడు పోతుంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది నువ్వు ఒక రూపానికి, నామానికి కట్టుబడి ఉన్నంతకాలం, ఏదైనా పని చేస్తూఉంటే ఇది నావలననే అవుతోంది, నేనే చేస్తున్నాను అనే భావన నీకు ఉన్నంతకాలం నిన్ను దుఃఖం విడిచిపెట్టదు అని చెప్పారు.

కొంతమంది అంతా భగవంతుడే అని నోటితో అంటారు, సంతోషం వస్తే తట్టుకోలేరు పొంగిపోతారు, దుఃఖం వస్తే తట్టుకోలేరు కృంగిపోతారు. అంతా భగవంతుడే, ఉన్నది ఆయనే అని నీవు నిజంగా నమ్ముతూ ఉంటే దుఃఖం వస్తే కృంగిపోవు, సంతోషం వస్తే పొంగిపోవు. అంతా భగవంతుడే అని నీ నోటితో అన్నా లోపల దానితాలుక అనుభవం నీకు లేదని నీ మొఖం చూస్తేనే తెలుస్తోంది అంటున్నారు. జనకుడు మహారాజు, ఆయనకు ధనం ఉన్నా, రాజ్యం ఉన్నా దాని తాలుక అభిమానం ఆయనకు లేదు. ఆయనకు ఉన్న దానికి ఆయన కాపలా కాసాడు కాని ఇది నాదని ఆయన మనస్సులో ఎప్పడూ అనుకోలేదు, దేనిపట్ల ఆయనకు అభిమానం లేదు. జనక మహారాజు కర్మని యోగంగా చేసాడు, ఆయన కర్మయోగి. ఎప్పడయినా నిష్కాముడికి జ్ఞానం వస్తుంది కాని సకాముడికి జ్ఞానం రాదు. కర్మఫలితం ఆశించేవాడికి జ్ఞానం రాదు. రాముడిని రాముడి కోసమే ప్రేమిస్తున్నాము అనుకోండి, ఆ ప్రేమకు కారణం కనబడటం లేదు అనుకోండి, ఆ భక్తి వలన మన మనస్సు శుద్ధి అయ్యి ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉన్నా లోపలఉన్న వస్తువు స్పష్టంగా నీకు గోచరిస్తేనేగాని నీ మనస్సుకు విషయాల మీద ఉన్న రుచి పోదు, ఆ రుచి పోవాలంటే లోపలఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవ్వాలి. కొంతమంది మాకు పదవి ఏమిటి అంటారు. పదిమంచి వచ్చి అడిగితే ఆ పదవి పుచ్చేసుకుంటారు. ఎందుకు పుచ్చు కొన్నావయ్యా అంటే పదిమంది వచ్చి కోరారు అని చెపుతాడు. పదిమంది కోరితే నీవు పుచ్చుకోవాలా? అంటే నీకు తెలియకుండా ఆ పదవి మీద కాంక్ష ఉంది కాబట్టి పదిమంది అడిగితే పుచ్చుకొన్నావు, నీకు ఆ కాంక్ష లేనప్పడు పదిమంది వచ్చి అడిగినా నీకు ఏమీ అనిపించదు.

నీకు మంచితనం ఒక్కటే సరిపోదు, నువ్వు ధైర్యవంతుడివి కాకపోతే నీకు ఆత్మజ్ఞానం కలుగదు అని కఠోపనిషత్‌లో చెప్పారు. మనం ఏదైనా సాధించాలి అనుకొన్నప్పడు మంచి తనం ఒక్కటే సరిసోదు, ఆ పని చెయ్యటానికి ధైర్యం ఉండాలి. సూక్ష్మబుద్ధి ఉండాలి. ఒకోసారి మీ ఇంట్లో వారందరు కూడా మీకు శత్రువులు అవ్వవచ్చు, అయినప్పటికీ మీరు శాంతచిత్తముతో ఉండగలగాలి. ఈ అమ్మాయి పేరు అన్నపూర్ణ అనుకోండి, నేను అన్నపూర్ణను, నేను అన్నపూర్ణను అని ఆ శరీరంతోటి, ఆ పేరుతోటి తాదాత్మ్యం పొందుతోంది అనుకోండి దుఃఖం వచ్చినప్పడు దుఃఖం, సంతోషం వచ్చినప్పడు సంతోషం అనుభవిస్తుంది. అసలు అన్నపూర్ణే లేదని ఆమెకు అర్థమయినప్పడు సంతోషం ఎక్కడ ఉంది, దుఃఖం ఎక్కడ

ఉంది? నేను అన్నపూర్ణను అనుకొంటూ పూజ చేస్తుంది, జపం చేస్తుంది అనుకోండి. పూజ, జపం చేసినప్పుడు మనస్సు అణుగుతుంది. పూజ, జపం ఎంతసేపు చేస్తాము ఏదో ఒక గంట చేస్తాము, మిగతా 23 గంటలు నేను అన్నపూర్ణను అనుకొంటుంది కదా, అప్పుడు సంతోషం, దుఃఖం, రాగద్వేషములు ఆగుతాయా? నేను ఒక వ్యక్తిని అని నువ్వు అనుకొన్నంత కాలం సంతోషం ఆగదు, దుఃఖం ఆగదు, చావు ఆగదు, పుట్టుక ఆగదు. అన్నపూర్ణ లేదు అని అర్థమయితే ఇంక ఏమీ లేదు. ఆనంద సముద్రం నీ హృదయంలోనే ఉంది. అది కళంకంగా ఉన్న వారికి అందదు, నిష్కళంకంగా ఉన్నవారికి అందుతుంది. నీ బుద్ధి నిష్కళంకం అయితే దోషరహితం అయితే నీ హృదయంలో ఉన్న ఆనందసముద్రం నీకు అందుతుంది. ఇక్కడ బాగా అర్థం చేసుకోండి. మీకు సంతోషం వచ్చింది అనుకోండి, వీటి అన్నింటి ఫలితాలు మీరు అనుభవిస్తున్నారు కదా. ఆ అనుభవించేది ఎవరు? మీలో ఉన్న అసత్యం అనుభవిస్తోంది కాని మీలో ఉన్న సత్యం అనుభవించటం లేదు. ఈ హెచ్చుతగ్గులు అన్నీ మీలో ఉన్న దొంగ నేను అనుభవిస్తోంది కాని అసలు నేనుకు వీటితో సంబంధం లేదు. లోకంలో వచ్చే గొడవలు, ఈ రాగద్వేషాలు, సుఖదుఃఖాలు ఇవి ఏమీ అసలు వస్తువును తాకవు. నేను అలాగ ఉన్నాను, నేను ఇలాగ ఉన్నాను అని నువ్వు అనుకొన్నంతకాలం నీకు వచ్చే ప్రతీ సంఘటనా నీవు అనుభవించవలసిందే. కేవలం పూజ చేయటం, జపం చేయటమే కాదు, అవి చేసుకో మంచిదే కాని నీకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి, నీ ప్రవర్తన ఎలా ఉంది, నీ మాట తీరు ఎలా ఉంది ఇవి అన్నీ జాగ్రత్తగా చూసుకో. మనం తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినప్పుడు ఖాళీ చేతులతో వచ్చాము, మరల స్మశానానికి వెళ్ళేటప్పుడు ఖాళీ చేతులతో వెళతాము. మనం బంగారం ఏదైనా చేయించుకొన్నా తీసేస్తారు, దస్తావేజులు ముక్కులో గాలి ఉండగానే లాగేస్తారు. ఈ మధ్యన ఒక ఆయన ఎక్కువ కాలం బతికాడు. పాపం ఆయన ఏమి చేస్తాడు. ఈ లోపుగా వాళ్ళ అబ్బాయి ఉద్యోగం చేసి రిటైర్ అయిపోయాడు. వాళ్ళ అబ్బాయి ఏమని ఉత్తరం వ్రాసాడు అంటే మీరు ఉన్న గది ఖాళీ అవ్వదా? అంటే ఇంక మీరు ఆగది విడిచిపెట్టి వెళ్ళరా అని, మనుషుల ప్రేమలు అలాగ ఉంటాయి. చదువులు చెప్పించి, ఉద్యోగాలు ఇప్పించి వారికోసం ఎంతో కష్టపడితే ఆ గది ఎప్పుడు ఖాళీ అవుతుంది అని ఉత్తరాలు వ్రాస్తే ఏమిటి? అందుచేత ఇంట్లో వాళ్ళ విషయంలో కూడా మన డ్యూటీ మనం చేయాలి, మమకారం పెట్టుకోకూడదు. అందుచేతనే రైల్వేమాష్టారు మీ గురువు

అని భగవాన్ చెప్పారు. టిక్కెట్లు అమ్మినప్పుడు ఆయనకు ఎక్కువ డబ్బు వచ్చినా, తక్కువ డబ్బు వచ్చినా బ్యాంకులో కట్టేస్తాడు. ఎక్కువ వస్తే ఆయనకు లాభం లేదు, తక్కువ వస్తే నష్టం లేదు, అది గవర్నమెంట్‌ది. అలాగే ఇదంతా దేవుడి పని అని మీ ఇంటి దగ్గర చేసే పని మీరు చేసుకోండి. లాభం వస్తే దేవుడు, నష్టం వస్తే దేవుడు, అది మీది అనుకోవద్దు. ఆపని అంతా దేవుడిది అనుకొని చేస్తే మీకు లాభం వచ్చినా, నష్టం వచ్చినా వికారాలు రావు. ఒక్క చైతన్యం తప్పించి మొత్తం సృష్టి అంతా వికారమే. మనిషి వికారం, పుట్టుక వికారం, చావు వికారం. అన్నీ వికారాలే. ఇవి అన్నీ అసత్యంలో నుండి వస్తున్నాయి. ఎవడైతే ఈ వికారాల మధ్యన ఉండి వికారరహితుడిగా అవుతాడో వాడికి పరమాత్మ తనను తాను అర్పించుకొంటాడు అంటే ఆయన స్వరూపాన్ని వాడికి ఇస్తాడు. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. స్మశానంలో శరీరం కాలిపోయినప్పుడు కళ్ళు కాలిపోతాయి, ముక్కు కాలిపోతుంది, చెవులు కాలిపోతాయి కాని కళ్ళ ద్వారా చూస్తాము, చెవుల ద్వారా వింటాము కదా ఆ చూసేబుద్ధి, ఆ వినేబుద్ధి కాలదు. ఇంద్రియాలు అన్నీ గోళాలు. ఈ గోళాలు అన్నీ కాలిపోయినా వాటి ద్వారా పొందిన అనుభవాలు, ఆ వాసనలు కాలవు, అవి అన్నీ కొత్త శరీరంలోనికి వచ్చేస్తాయి. ఇప్పుడు మీకు రోజూ సినిమా చూడాలని ఉంది అనుకోండి. ఆ కళ్ళు కాలిపోతాయి కాని సినిమా చూడాలనే వాసన కొత్త శరీరంలోనికి వచ్చేస్తుంది, అక్కడ కొత్త కళ్ళతో చూస్తూ ఉంటాడు. నీవు బాహ్యంగా ఎంత నిగ్రహించుకొన్నా వాసన వేరుతో సహా నశించాలంటే లోపలఉన్న పరమాత్మ నీకు గోచరం అవ్వాలి. లోపలఉన్న పరమాత్మ నీకు గోచరం కాకపోతే ఒకవేళ నీకు బాహ్యంగా విషయాలతో సంబంధం లేకపోయినా ఆ విషయాల మీద ఉన్న రుచి నీకు పోదు. మరి ఆ రుచి ఎలా పోతుంది? చైతన్యం తాలుక రుచి నీకు తెలిసే వరకు విషయాల మీద ఉన్న రుచి పొమ్మన్నా పోదు. మీరు చేసుకొనే సాధన మీరు చేసుకోండి. మీ ప్రయత్నం విడిచిపెట్టవద్దు. మీరు చేస్తున్న ప్రయత్నమే ఈశ్వరుని దయగా మారిపోతుంది. ఆయన దయను సంపాదిస్తే భౌతికమైన అవసరాలు తీర్చటమే కాదు, ఆత్మజ్ఞానాన్ని కూడా ఇస్తాడు. భగవంతుడి దయను సంపాదించటమే మన సాధన యొక్క లక్ష్యం. భగవంతుడి యొక్క రూపాన్ని ధ్యానించుకొంటూ, ఆయన నామాన్ని స్మరించుకొంటూ, భగవంతుడి యొక్క కళ్యాణగుణాలను మననం చేసుకొంటూ ఉంటే మనస్సుకు లోచూపు కలుగుతుంది, అప్పుడు మనస్సు పల్చబడి, పల్చబడి చైతన్యసాగరంలో ఐక్యమయిపోతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 07-11-05 | సోమ | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| 10-11-05 నుండి 18-11-05 వరకు విశాఖపట్నం క్యాంపు | | |
| 23-11-05 | బుధ | జువ్వలపాలెం |
| 27-11-05 | ఆది | తణుకు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 28-11-05 | సోమ | పాతాళ మెరక |
| 09-12-05 నుండి 19-12-05 వరకు అరుణాచలం క్యాంపు, 13న దీపోత్సవం | | |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# సాధన ఎలా ఉండాలి?

పరమాత్మ ఏక స్వరూపుడు. అయితే భక్తుల నమ్మకం, గురి అనుసరించి రాముడు, కృష్ణుడు, గణపతి, దేవి, అల్లా, ఏసుక్రీస్తు.... ఈ విధంగా వివిధ నామాలతో, రూపాలతో ఆరాధిస్తున్నారు. అదే విధంగా గురువు కూడా ఏక స్వరూపుడే. ఏ పేరుతో ఉన్నా, ఏ రూపంలో ఉన్నప్పటికీ, ఏ సంప్రదాయానికి చెందినా సద్గురువులు పరమాత్మ స్వరూపులే. కనుక నాది ఫలానా గురుపీఠము, నాది ఫలానా సంప్రదాయము (ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత), ఫలానా నామ రూపాలు గలవారే నా గురువు, అన్య సంప్రదాయాలను గౌరవించను, అన్య గురువులకు నమస్కరించను, అన్య గురుపీఠానికి వెళ్ళను... వారిని దర్శించను, పూజించను అనే సంకుచిత భావాలు భక్తులకు ఉండకూడదు. అందువలన సాధన పడిపోతుంది. మన సంప్రదాయాల పట్ల మనకు ఆరాధన భావం ఉండాలి. అదేవిధంగా ఇతర సంప్రదాయాలను తగిన విధంగా గౌరవించాలి. మన గురువుల పట్ల శరణాగతి ఉండాలి, ఇతర గురువులను, మహాత్ములను గౌరవించాలి. వారందరిలో కూడా మన గురువునే దర్శించి, పూజించాలి. ఆయా మహాత్ముల అఖండ బోధలలోని సారాంశాన్ని గ్రహించాలి. ఈ రకమయిన అవగాహన కలిగిన నాడు మన సాధన మరింతగా ఇనుమడిస్తుంది.

**- బొప్పన అరుణాదేవి, హైదరాబాదు**

# రూపనామాల దృష్టి ఉన్నంతకాలం - వస్తు దృష్టి రాదు

రహీమ్ అనే వ్యక్తి హిందూమతం స్వీకరించాడు. అతనికి రామన్ అనే పేరు పెట్టబడింది. మరుసటి రోజే ఆయనను ఒకరు "రామన్‌గారు" అని పిలిస్తే పలకకుండా వెళ్ళిపోతూ ఉంటే పరుగెత్తుకొని వెళ్ళి భుజం తట్టి మీపేరు రామన్ కదా! అంటే ఆయన నవ్వుతూ మీరు పొరపాటుపడ్డారు నాపేరు రహీమ్ అన్నాడు. ఇంత తతంగం జరిగినా పాతపేరులోనే చిరకాలం ఉండటం వల్ల కొత్తపేరు మర్చిపోయాడు. అలాగే అనేక జన్మలనుంచి ఈ పేరు నాది, ఈ తెలివి నాది అని స్థిరపడిపోయాము. దాన్ని కాదని "నీవు ఆత్మ స్వరూపుడవని" గురువు తెలిపినా ఈ కొత్త భావనలో ఉండలేకపోతున్నాము. ప్రారబ్ధం ఆడిస్తున్నప్పడు కలతలతో కన్నీళ్ళు పెట్టుకొంటున్నాము. స్వస్వరూపంలో నిలవటానికి మన రూపనామాలను మైనెస్ చెయ్యటానికి కొంత కాల వ్యవధి పడుతుంది. బొమ్మల దుకాణంలో ఉన్న పిల్లవాడు ఉత్సాహంతో వాటిని సొంతం చేసుకొని ఎప్పడు వాటితో ఆడుకుందామా అని తపన ఉంటుంది. ప్రక్కన ఉన్న తండ్రి నిర్వికారంగా ఉంటాడు. అలాగే మనలో వాసనలు ఉంటే కోరికలు కలుగుతాయి. అప్పడు ప్రకృతి విషయాలైన బట్టలకు, జుట్టుకు, నగలకు, బానిసలమౌతాము. జ్ఞానికి కోరికలు ఉండవు. దేనికీ బానిసకాడు. శ్రీనాన్నగారు "మిధ్యా భావన వల్లనే ఉన్న సత్‌పదార్థం లేనట్లుగాను లేని ప్రకృతి రూపాలు ఉన్నట్లుగాను తెలుపుతుంది. ఏ విషయాల పట్ల నీ మనస్సు వడిగా పరుగెడుతున్నదో అందుండి ఉపసంహరించే వరకూ నీకు ఏ దేవుడూ సహాయం చెయ్యలేడు" అన్నారు. చిన్నమ్మగారు అన్నారు "రూపము గోచరించగానే రూపమాతా! నాకు జన్మ ఎందుకు వచ్చిందో ఎందుకు చూస్తున్నానో నాకు తెలియదు నీకు తెలుసు చూచూట దోషమని నీవు తెలిపినచో ఆ పొరపాటు తెలుసుకొని ఇక చూడను రూపము లేని పరమాత్మను తెలిసే వరకూ రూపమాతా నీకు నమస్కారము" అన్నారు. సాక్షీ రూపుని చాటున పెట్టుకొని, చాటున ఉన్నాము. ఈ మొండి మాయను నేను చంపలేను అని గురువు పాదాలకు మొరపెట్టుకొని, గురునామ రూపాలను పట్టుకొంటే రహీమ్ లేడు, రామన్ లేడు. వస్తు దృష్టి కలుగుతుంది. రూప నామాల "మాయ" మాయమౌతుంది. సుఖి అవుతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

## సవరణ

అక్టోబరు, 2005 సంచికలో 'మోహం నశిస్తేనే మోక్షబుద్ధి కలుగుతుంది' అనే శీర్షికలో 'కుటుంబ రాగబంధనాలలో చిక్కుకొని దుఃఖం కలిగితే, <u>వారికీ నాకు ఏమిటి సంబంధం అని ఒక్కసారి ఆలోచిస్తే నిప్పల</u> మీద నీళ్ళు పోస్తే నిప్పలు చల్లారినట్లు.... అనే క్రమంలోని వాక్యంలో అండర్‌లైను చేసింది పొరపాటున ముద్రితం కాలేదని గమనించకోరుతున్నాము.

- ఎడిటర్